



చదివి..ఎదిగారు.. వీసీగా వచ్చారు!

నన్నయ వీసీగా సత్తుపాటి ప్రసన్నశ్రీ

విద్యార్థులకు ఆమె ఆదర్శం.. ఎలా చదవాలి.. ఎలా ఎదగాలి అనే దానికి ఆమె ఒక నిదర్శనం.. ఎందుకంటే ఎక్కడో గుంటూరు జిల్లా స్టువర్టుపురం ఆమె స్వగ్రామం.. ఆ పేరు వింటే అందరికీ గుర్తొచ్చేది ఒక్కటే.. కానీ అక్కడ నుంచి ఎదిగారు.. కష్టపడి చదివారు.. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 23 భాషలు మాట్లాడతారు.. 17 గిరిజన భాషలకు లిపిని తయారుచేసి తానేంటో నిరూపించారు.. కూటమి ప్రభుత్వం పట్టం కట్టడంతో తూర్పుగోదావరి జిల్లాలోని నన్నయ వర్శిటీ ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు.. ఆమెను ఆంధ్రజ్యోతి పలకరించగా నేను రాజమహేంద్రవరం కోడలినే అంటూ పలు విషయాలు చెప్పకొచ్చారు.. 6



సిల్వర్..మెరుపులు!

బంగారమే కాదండోయ్.. సిల్వర్ ధగధగ లాడుతోంది.. తగ్గుతూ పెరుగుతూ రూ.లక్షకు చేరింది.. గత వారం రోజులుగా రూ.99,500లకు చేరువై రూ.లక్ష దోబూచులాడుతోంది.. బుధవారం రూ.99,800లు పలికింది.. గురువారం రూ.లక్షకు చేరువైంది. 6



మన ప్రకృతి సాగుపై జర్మన్ బృందం ఆసక్తి

మన ప్రకృతి సాగును పరిశీలించేందుకు జర్మన్ బృందం వచ్చింది.. దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో రైతులతో మాట్లాడి ప్రకృతి సాగుపై అవగాహన పెంచుకుంది.. ఎలా సాగు చేయాలో పరిశీలించింది. 7

సమస్య ఉంటే వాట్సప్ మెసేజ్ చేయండి

- నెంబరు 9552300009

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు తమ వద్ద ఉన్న సమాచారాన్ని వాట్సప్ నంబర్ 9552300009 ద్వారా వేగంగా చేరవేయవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పౌర సేవలతో పాటు ప్రజలకు సమాచారం చేరవేయడానికి కూడా వాట్సప్ గవర్నెస్ ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పథకాల సమాచారం కూడా ఈ వాట్సప్ ద్వారా ప్రజలకు చేరవేయవచ్చన్నారు. జిల్లా యంత్రాంగానికి ప్రజలు ఏదైనా ఫిర్యాదు చేయాలనుకుంటే ఈ వాట్సప్ నెంబర్‌కు మెసేజ్ చేస్తే సరిపోతుందన్నారు. వాట్సాప్ ఫిర్యాదుల గణాంకాలు, వాటి పరిష్కారం వివరాలపై డివిజనల్ అభివృద్ధి అధికారులు నివేదిక అందజేయాలన్నారు.

రీసర్వే సక్రమంగా జరగాలి : కలెక్టర్

రంగంపేట,ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భూ రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు ఆదేశించారు.భూముల సమగ్ర రీ సర్వే ప్రక్రియలో భాగంగా గురువారం రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామంలో రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే జరిగే సమయంలో భూ యజమానులను భాగస్వామ్యం చేయాలన్నారు.సరిహద్దుదారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే చేసిన వాటిపై భూ యజమానులకు ఏదైనా అభ్యంతరం ఉంటే సర్వే తిరిగి చేయాలన్నారు. ఉద్దేశపూర్వకంగా రికార్డులను టాంపరింగ్ చేసినా, తప్పుగా నమోదు చేసినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.ఈ పర్యటనలో జిల్లా అధికారి బి.లక్ష్మీ నారాయణ, తహశీల్దార్ కోసు అనసూయ, మండల సర్వేయర్ కె.కుమారి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ హేమసుందర్, ఆర్ఐ గోపి, సర్వేయర్లు పాల్గొన్నారు.



దొంతమూరులో రీసర్వే చేసిన భూముల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

క్యూఆర్ కోడ్‌తో మెరుగైన పౌర సేవలు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్‌తో మరింత మెరుగైన పౌర సేవలందించడానికి చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఏపీ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రూప్-2, ఇంటర్మీడియట్ పరీక్షలు,పీ4 మోడల్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు.ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 8 నుంచి 18 వరకూ పీ4 సర్వే, గ్రామ సభలు 20 నుంచి 24 వరకూ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

1 నుంచి ఇంటర్ పరీక్షలు

మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 51 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి ఏడాది 20591, రెండో ఏడాది 19062, ఒకేషనల్ మొదటి ఏడాది 2226, రెండో ఏడాది 1875 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. పరీక్షలు జరుగుతున్న రోజుల్లో ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబరు 0883-2473430 అందుబాటులో ఉంటుందన్నారు. రాజమహేంద్రవరంలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని, ఐదు సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్న రాముడు,ఎస్పీ నరసింహ కిశోర్, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీకృష్ణ, డీఆర్వో సీతారామమూర్తి,సీపీవో అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.



సైకిల్‌కు సవాల్

కూటమి పక్షాన భారీగా మోహరింపు

- ఎమ్మెల్సీ ఎన్నికపై తీవ్ర ఉత్కంఠ
- రంగంలోకి మంత్రులు, ఎమ్మెల్యేలు
- ఆశించిన మెజార్టీకి పట్టు
- బరిలో 35 మంది అభ్యర్థులు
- మొత్తం ఓటర్లు 3.15 లక్షలు
- చెల్లని ఓట్ల తగ్గింపుపై వ్యూహం
- పట్టభద్రుల చుట్టూ ప్రచారం

(ఏలూరు/కాకినాడ, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీలో ఉన్న అభ్యర్థులంతా ప్రచారానికి మరింత పదునుపెట్టారు. క్షేత్ర స్థాయిలో గట్టి నాయకత్వ పట్టున్న టీడీపీ ఎట్టి పరిస్థితుల్లోను ఈ స్థానం నుంచి తమ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలిచి తీరాలనే పట్టుదలతో ఉంది. సీఎం చంద్రబాబు నుంచి ముఖ్యనేత లంతా ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వారీగా సమాచారాన్ని రాబట్టడమే కాకుండా అప్పటి కప్పుడే సమీక్షిస్తున్నారు. ప్రచారంలో ఎక్కడ వెనుకబడ్డారు? ఎక్కడ దూసుకెళ్తున్నారనే విషయాన్ని రాబడుతూనే వచ్చారు.పట్టభద్రులైన ఓటర్లంతా తరలివచ్చేలా చేయడం అంత సులువు కాదని భావించి యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశారు. గత అనుభవాలను దృష్ట్యా సాధారణ ఎన్నికల కంటే మించి ఎమ్మెల్సీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు రావా లన్న షరతు విధించారు.దీంతో ఇప్పుడు కూటమిలో ఉన్న ఎమ్మెల్యేలు,మంత్రులతో పాటు మిగతా వారందరికీ ఈ ఎన్నిక ఒక సవాల్‌గానే మారింది.పట్టభద్రుల ఓటర్లు అత్యధికంగా ఉన్న మండల కేంద్రాలు,పట్టణాలు, కార్పొరేషన్లలో ప్రచారాన్ని మోహరించారు.

బరిలో 35 మంది..

ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. వీరిలో అత్యధికులు ప్రచారంలోను శరవేగంగా ముందుకు సాగుతూనే ఉన్నారు. యువతకు మేలు జరగాలంటే తాము విధాన పరిషత్‌లో అడుగు పెట్టేలా చూడాలని ఓటర్లను అభ్యర్థిస్తూ వస్తున్నారు. తెలుగుదేశం పక్షాన పేరాబత్తుల రాజశేఖరం అభ్యర్థిగా ఉన్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, వివిధ విభాగాల కార్పొరేషన్ల ఛైర్మన్‌లు, సభ్యులతోపాటు స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రచారంలో ఒక ఊపు తెస్తున్నారు. ఏ నియోజకవర్గంలో ఎంతెంతమంది ఓటర్లు ఉన్నది ఇప్పటికే గుర్తించినందున దీని ఆధారంగా చేసుకుని ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమ గోదావరికి చెందిన ఇన్‌చార్జి మంత్రులు గొట్టిపాటి, నాదెండ్లతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఇన్‌చార్జి మంత్రులు నారాయణ,అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు కూటమి నేతలను ఏకం చేసి ఏ రోజుకారోజు నియోజకవర్గాల్లో ఉన్న స్థితిగతులను ఆరా తీస్తున్నారు. వీరితో పాటు మంత్రులు కందుల దుర్గేష్,సుభాష్ కూడా ఆయా నియోజకవర్గాల్లో కూటమి శ్రేణులను సమన్వయం చేస్తున్నారు. జనసేన పక్షాన ఎమ్మెల్యేలుగా ఉన్న పోలవరం, ఉంగుటూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, నిడదవోలుతో పాటు రాజానగరం, పిఠాపురం, రాజోలు, పి.గన్నవరం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఓటర్ల నాడి ఎలా ఉందో జనసేన ఆ పార్టీ ఆరా తీస్తోంది. బీజేపీ మాత్రం ఈ విషయంలో పెద్దగా చొరవ తీసుకున్న పరిస్థితి కనిపించడంలేదు. తెలుగుదేశం, జన సేన నేతలంతా ఉమ్మడిగా నియోజకవర్గాల్లో కలియ తిరుగుతుండగా,కమలనాథులు మాత్రం తమకు ప్రత్యేకించి ఆహ్వానం లేదన్నట్టుగా మిన్నకుండిపోతున్నారు.మండల స్థాయిలోను ఇదే ధోరణిలో అన్ని పార్టీలు ఉన్నాయి. తెలుగు దేశం మాత్రం అభ్యర్థి రాజశేఖరం గెలుపును భుజానకెత్తుకుని విరామం లేకుండా ప్రచారం కొనసాగిస్తోంది.

చెల్లని ఓట్లే అత్యంత కీలకం

గడిచిన పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో భారీగా చెల్లని ఓట్లు నమోదయ్యాయి. అప్పట్లో రెండు లక్షల 20 వేలకుపైగా ఓట్లు ఉండగా లక్షా 92 వేల 24 ఓట్లు పోలయ్యాయి. దాదాపు 13 వేల 852 ఓట్లు చెల్లకుండా పోవడంతో అందరూ ముక్కున వేలేసుకున్నారు. పీడీఎఫ్ బలపరిచిన యిళ్ల వెంకటేశ్వరరావుకు 98 వేల 193 ఓట్లు లభించగా ఆయన సమీప ప్రత్యర్థి నల్లమిల్లి శేషారెడ్డికి 38 వేల 124 ఓట్లు లభించాయి. ఇప్పుడు జరగబోతున్న ఎన్నికల్లో టీడీపీ పక్షాన రాజశేఖరం ఉండగా పీడీఎఫ్ తరపున దిడ్ల వీరరాఘవులు పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య నువ్వా నేనా అన్నంతగా కూటమి పక్షాన వామపక్షాల తరపున హోరాహోరీగా ప్రచారం సాగుతోంది. వచ్చిన చిక్కల్లా ఏంటంటే ఈ సారి గతంకంటే లక్ష ఓట్లు అదనంగా మూడు లక్షల 15 వేలకుపైగా ఓటర్లు ఉన్నారు. ఇప్పుడు ఎటు తిరిగి సాధ్యమైనంత మేర చెల్లని ఓట్లు తగ్గించుకోవడం, ఆ మేరకు మెజార్టీ స్థానంలో వచ్చేలా చూడడం కూటమి పక్షాన నేతలందరికీ పెద్ద అగ్ని పరీక్షగానే మారింది. అందుకనే ప్రాధాన్యత ఓటు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఓటర్లందరికీ విడమరిచి మరీ చెబుతున్నారు. ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్నుతోనే బ్యాలెట్ పేపర్‌పై ఒకటవ ప్రాధాన్యత ఓటును ఒకటవ సంఖ్యగా వేయాల్సిందిగా పదేపదే చెబుతూ వస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇన్ టూ మార్క్ పెట్టవద్దని అభ్యర్థిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మిగతా ఇండిపెండెంట్ సభ్యులు భారీగానే ఉన్నందున వీరంతా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రచారం ఉధృత స్థాయికి తీసుకువెళ్తున్నారు. గత ఎన్నికల్లో 43 మంది పోటీ పడగా 12 మంది అభ్యర్థులు మాత్రమే వెయ్యి సంఖ్యను దాటి ఓట్లు దక్కించుకోగలిగారు. ఈసారి టీడీపీకి పూర్తి అనుకూలత దక్కేలా కూటమి నేతలు మోహరించడంతో ఆ మేరకు మిగతా ఇండిపెండెంట్‌లకు వచ్చే ఓట్ల సంఖ్యలో చీలిక ఏర్పడే అవకాశం కనపడుతుంది.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు చిత్రంలో ఎమ్మెల్యేలు, నాయకులు

గెలుపు రాజశేఖరందే

మంత్రి నిమ్మల రామానాయుడు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని జిల్లా ఇన్‌చార్జి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎంత మంది అభ్యర్థులు ఉన్నా తమదే గెలుపు అన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి,రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మ న్ కుడుపూడి సత్తిబాబు, అనుశ్రీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆనందం వరించెన్!

అప్పుడు ఏడిపించెన్...ఇప్పుడు ఠంఛన్

- తీరిన అన్నదాతల కష్టాలు
- చకచకా ఖరీఫ్ ధాన్యం సేకరణ
- 5 లక్షల మెట్రిక్ టన్నులు
- ఖాతాల్లోకి రూ.910 కోట్లుపైనే
- ఠంఛనుగా చెల్లింపులు
- ఉమ్మడి జిల్లాలో ఆనందం
- గత వైసీపీలో రైతులకు చుక్కలు
- నెలల తరబడి వేధింపులు
- నాడు ఏప్రిల్ దాటినా అరకొరే
- బాకీలు అడిగితే అరెస్టులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఎన్నాళ్లకెన్నాళ్లకు..అన్నదాతలకు ఆనందం వరించెన్..బకాయిలకు ఎదురు చూపుల్లేవు.. కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరగడం లేదు.. ఖాతాలో డబ్బులు పడ్డాయో లేదో నెలలతరబడీ బ్యాంకుల వద్ద పడిగాపులు లేవు..ధాన్యం ఇచ్చిన కొన్నిరోజులకే ఏ మాత్రం ఆలస్యం లేకుండా నేరుగా ఖాతాల్లోకి డబ్బులు.. ఇదీ కూటమి ప్రభుత్వం రాకతో జిల్లాలో మారిన అన్నదాతల పరిస్థితులు..జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం సేకరణ ఎట్టకేలకు పూర్తికాగా ఇప్పటి వరకు సేకరించిన సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నులకు అన్నదాతల ఖాతాల్లోకి ఏకంగా రూ.910 కోట్లకుపైగా కూటమి ప్రభుత్వం చెల్లించింది. ఐదేళ్ల తర్వాత తొలిసారి ధాన్యం బకాయిలకు అన్నదాతలు రోడ్డెక్కే పరిస్థితి లేకుండా ఠంఛనుగా చెల్లింపులు జరిగాయి.గత వైసీపీ ప్రభుత్వంలో ఏటా అన్నదాతలకు నరకయాతనే.

గత ఐదేళ్లూ నరకమే..

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు అన్నదాతలకు ధాన్యం డబ్బుల కష్టాలు పెరిగాయి. ధాన్యం డబ్బులు 21 రోజుల్లో చెల్లిస్తా మంటూ అప్పట్లో సీఎం జగన్ వరుసగా ఐదేళ్ల పాటు గొప్పలు చెప్పారు. కానీ ఆచరణలో ఏ యేడు దీన్ని నిలబెట్టుకోలేదు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో అన్నదాతల నుంచి ధాన్యం సేకరించడం, బాకీలు నెలలు గడుస్తున్నా ఇవ్వ కుండా వేధించడం పరిపాటి.ఎవరైనా రైతులు బాకీలకు రోడ్డెక్కితే అరెస్టులు చేయించింది. చివరకు బాకీ వివరాలు సైతం బయటకు పొక్క నీయొద్దని జిల్లా జేసీలు, పౌరసరఫరాల సంస్థను ఆదేశించి గుట్టు పాటించింది. వాస్తవానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 10.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అన్నదాతలు డబ్బులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టేది. లక్ష్యం కంటే తక్కువగా సేకరించిన ధాన్యానికి రూ.1,143 కోట్ల వరకు చెల్లించాల్సి వచ్చేది. కానీ ప్రభుత్వం మాత్రం ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరించిన తర్వాత మార్చి,ఏప్రిల్ దాటినా సరే చెల్లించాల్సిన బాకీల్లో సగం కూడా అన్నదాతల ఖాతాల్లోకి జమచేసేది కాదు. అటు రబీలోను ఇదే తంతు. రూ.700 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉంటే వాటినీ ఇచ్చేది కాదు. ఐదేళ్ల పాటు అన్నదాతలను అప్పటి వైసీపీ ప్రభుత్వం దారుణంగా వేధించింది. అనేక సార్లు కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అన్నదాతలు బాకీల కోసం రోడ్డెక్కారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి సమీపంలో ఓ మండలంలో ధాన్యం బాకీ కోసం ఓ రైతు ఏకంగా ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి. ఇలా గత వైసీపీ పాలనలో అనేక మంది అన్నదాతలు నరక యాతన పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. కూటమి ప్రభుత్వంలో తొలిసారీ ఖరీఫ్ ధాన్యం సేకరణ కావడంతో ప్రభుత్వం ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకుంది.ఏ రైతుకు ఇబ్బంది లేకుండా అధికారులను అప్రమత్తం చేసింది.

ఠంఛనుగా ఖాతాల్లోకి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన తొలి ఖరీఫ్ ధాన్యం సేకరణ నేపథ్యంలో చెల్లింపులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎక్కడా లోటు పాట్లు లేకుండా ఠంచనుగా చెల్లింపులు చేసింది.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 4.50 లక్షల మెట్రిక్ టన్నులకు రైతుల ఖాతాల్లోకి రూ.910 కోట్లుపైనే జమచేసింది. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 1.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. అత్యధికంగా సామర్లకోట మండలంలో 35,723 మెట్రిక్ టన్నులు, కరప 19,838, పెదపూడి 19,450, కాజులూరు 17,026, జగ్గంపేట 11,792, పెద్దాపురం 8,042, కోటనందూరు మండలంలో 7,780 మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం సేక రించింది. ఎక్కడా ధాన్యం తీసుకోవడం లేదనే ఫిర్యాదు లేకుండా అన్నదాతలందరి వద్ద గింజలు సేకరించింది. జిల్లా వ్యాప్తంగా రూ.356 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించి 102 మిల్లులకు అప్పగించింది.ఇందులో ఇప్పటి వరకు మొత్తం రూ.355.01 కోట్లు చెల్లించేసింది. మిగిలిన చిన్న మొత్తాలకు ఎఫ్‌టీవోలు తయారుచేసి చెల్లింపులకు పంపింది.ఇలా ఎక్కడా జాప్యం లేకుండా పక్కాగా సకాలంలో చెల్లింపులు జరిపింది. ఇలా 26,415 మంది అన్నదాతల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిం చింది. ఇందుకు రూ.523 కోట్లు చెల్లించాల్సి ఉం డగా ఇప్పటి వరకు రూ.522.71 కోట్లు చెల్లిం చింది. మొత్తం 39,180 మంది అన్నదాతల ఖాతాల్లోకి జాప్యం లేకుండా చెల్లింపులు జరి పింది.అత్యధికంగా రామచంద్రపురం మండ లంలో 28,357 మెట్రిక్ టన్నులు, పామర్రు 27,311, కపిలేశ్వరపురం 24,183, మండపేట మండలంలో 18వేలకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. తూర్పుగోదావరి జిల్లాలో రూ.200 కోట్లకు పైగానే చెల్లింపులు చేసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఏరైతును ఇబ్బంది పెట్టకుండా దాదాపు 90 వేల మందికిపైగా రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమచేసింది. దీంతో రైతులు ఆనందోత్సవాలు చేసుకుంటున్నారు. గడచిన ఐదేళ్లలో ఏనాడు డబ్బులు ఇలా సకాలంలో రాని పరిస్థితులు కళ్లారా చూసిన అన్నదాతలు కూటమి ప్రభుత్వం రాకతో ఆనాటి చీకటి రోజులు తొలగి ఎప్పటి బాకీలు అప్పుడు జమ అవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రిలో బీ..అలర్ట్ !

- పలువురు డాక్టర్లకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు ?
- వైద్యుల పనితీరు మోనిటరింగ్ చేస్తున్న జిల్లా అధికారులు
- హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీని హెచ్చరిస్తూ సూపరింటెండెంట్ సర్క్యులర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీటీజీహెచ్)లో పనిచేస్తున్న వైద్యులు, ఫ్యాకల్టీ పనితీరుపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించే విషయంలో కొందరు వైద్యులు, ఫ్యాకల్టీ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సీరియస్‌గా భావిస్తున్నట్టు తెలుస్తోంది. వైద్యులు అందుబాటులో ఉండడంలేదని, రెగ్యులర్ ఓపీ సమయాల్లోనూ విధులకు గైర్హాజరవుతున్నారని రోగులు, వారి బంధువులు, ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఇటీవల జిల్లా కలెక్టర్ నెల రోజుల వ్యవధిలోనే రెండుసార్లు ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీలు చేసి వైద్యుల గైర్హాజరును గుర్తించారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ హాజరుపట్టీతో పాటు కొన్ని రికార్డులు వెంట తీసుకెళ్లి పరిశీలించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట పలువురు వైద్యులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరినట్టు తెలిసింది. దీంతో ఆసుపత్రి అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ అందరు హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీకి బీ..అలర్ట్ అంటూ ఒక సర్క్యులర్ పంపించారు. హెచ్‌వో డీలు, ఫ్యాకల్టీ అందరూ డ్యూటీల విషయంలో నిర్లక్ష్యంగా ఉండరాదని, డ్యూటీ టైమింగ్స్ సక్రమంగా పాటించాలని, ఓపీ వేళల్లో ఫ్యాకల్టీ అందరూ ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని, సెలవులు పెట్టడానికి సరైన కారణాలు చూపాలని స్పష్టం చేశారు. ఈ సర్క్యులర్ ఆసుపత్రి హెచ్‌వోడీలతో పాటు ఫ్యాకల్టీలోనూ చర్చనీయాంశంగా మారి గుబులురేపుతోంది.



ఎంఎన్‌వోలను హెచ్చరిస్తున్న సూపరింటెండెంట్

లంచం తీసుకున్నట్టు ఫిర్యాదులు వస్తే ఇంటికే

ఎంఎన్‌వోలకు హెచ్చరిక

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వైద్యసేవల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల నుంచి లంచం డిమాండ్ చేసి డబ్బులు తీసుకున్నట్టు ఫిర్యాదు వస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ హెచ్చరించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ ఎంఎన్‌వోల సూపర్‌వైజర్‌తో పాటు, ఇతర ఎంఎన్‌వోలను తన ఛాంబర్‌కు పిలిచి మాట్లాడారు. రోగులను స్ట్రెచర్, వీల్‌చైర్‌లో తీసుకెళ్లడానికి, వార్డులో అడ్మిట్ చేయడానికి, ఎక్స్‌రే, ఎంఆర్ఐ తదితర స్కానింగ్‌ల కోసం తీసుకెళ్లడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు తనకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు.పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవన్నారు. డ్యూటీ సమయంలో విధులను సక్రమంగా నిర్వర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వైద్యసేవలకు రోగుల సహాయకులను డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వివిధ వర్గాల సమాచారంతోనే సూపరింటెండెంట్ తీవ్రంగా పరిగణించి ఎంఎన్‌వోలను హెచ్చరించినట్టు ప్రచారం జరుగుతోంది.



హరియాణా-బిహార్ జట్ల మధ్య మ్యాచ్





ఆరో రోజూ అదుర్స్..

కాకినాడలో ఉత్సాహంగా కొనసాగుతున్న సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఆరో రోజూ ఉత్సాహంగా సాగింది. వివిధ మ్యాచ్‌లు 'అదుర్స్' అనిపించాయి. ఆరో రోజు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు మొత్తం 7 మ్యాచ్‌లు జరిగాయి. ఆరో రోజు జరిగిన హాకీ పోటీలకు కాకినాడ జేఎన్‌టీయూ స్పోర్ట్స్ సెక్రటరీ శ్యామ్‌కుమార్, హాకీ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు తదితరులు పాల్గొన్నారు. ఒడిసా, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిసా 5-0 తేడాతో విజయం సాధించింది. హరియాణా, బిహార్ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హరియాణా సెక్రటేరియట్ 3-2 తేడాతో గెలుపొందింది. తెలంగాణ సెక్రటేరియట్, ఢిల్లీ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ సెక్రటేరియట్ 6-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ భువనేశ్వర్, ఆర్ఎస్బీ కొచ్చి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ కొచ్చి 5-0 తేడాతో విజయం సాధించింది. గోవా సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ 4-0 తేడాలో విజయం సాధించింది. ఆర్ఎస్బీ రాయపూర్, ఆర్ఎస్బీ కాన్పూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ కాన్పూర్ 4-0 తేడాతో విజయం సాధించింది. హరియాణా, ఢిల్లీ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హరియాణా సెక్రటేరియట్ 6-1 తేడాతో విజయం సాధించింది.

క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న హర్షవర్ధన్





గెలుపు సంబరాలు

ఫిట్‌నెస్సే కారణం



60 ఏళ్ల వయసులో కూడా మేము ఇంకా ఆడుతున్నామంటే దానికి కారణం ఫిట్‌నెస్. క్రీడలు పట్ల మాకున్న మక్కువ మమ్మల్ని ఈ స్థాయికి తీసుకు వచ్చింది. మేమిద్దరం జాతీయ స్థాయిలో 8 నుంచి 10 మ్యాచ్‌లు ఆడాం.

రుబీనా హర్షద్-ఎంపీ టీం కెప్టెన్, అల్కా శర్మ-ఎంపీ టీం ఉమెన్స్ మేనేజర్

కార్పొరేషన్(కాకినాడ), (ఆంధ్రజ్యోతి):



అమ్మతో నేనాడుకుంటా..





టర్ఫ్ గ్రౌండ్ స్పీడ్



టర్ఫ్ గ్రౌండ్ చాలా స్పీడ్‌గా ఉంది. ఆటగాళ్ల కదలికలు కూడా చాలా స్పీడ్‌గా ఉన్నాయి. వేగంగా వచ్చే బాల్‌ని ఆపాలంటే ఏకాగ్రత చాలా అవసరం. ఇటువంటి గ్రౌండ్‌లో ఆటను ఆస్వాదిస్తుంటాం. హాకీ టోర్నమెంట్లకు అనేక రాష్ట్రాలు వెళ్తుంటాం. అయితే కాకినాడలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో క్రీడాకారుల పట్ల మంచి ఆదరణ చూపిస్తున్నారు. ఏర్పాట్లు అన్ని బాగున్నాయి.

నరేష్‌కుమార్ చౌదరి, సీబీడీటీ న్యూఢిల్లీ, మెయిన్ గోల్ కీపర్

టెక్నాలజీ మారింది ఇప్పుడు



మన దేశంలో రాష్ట్రాల మధ్య జరిగే హాకీ టోర్నమెంట్లకు టెక్నాలజీ ఉండేది కాదు. 2023లో కాకినాడ వేదికగా జరిగిన సీనియర్ ఉమెన్ హాకీ టోర్నమెంట్ నుంచి ఈ టెక్నాలజీ ప్రారంభించారు. ఈ టెక్నాలజీ వల్ల ఆడుతున్న జట్లకు ఎటువంటి నష్టం జరగకుండా ఉంటుంది. అలాగే యూట్యూబ్ లింక్ ద్వారా దేశంలో ఏ రాష్ట్రంలో అయిన ఏ గ్రామం నుంచి అయిన ఆడుతున్న మ్యాచ్‌లను లైవ్ చూడవచ్చు. గతంలో మన రాష్ట్రం నుంచి నేనొక్కన్నే టెక్నికల్ ఆఫీసర్‌గా ఉండేవాడిని. ప్రస్తుతం మన రాష్ట్రం నుంచి 15 మంది జాతీయ స్థాయి టెక్నికల్ ఎంపైర్స్‌గా వ్యవహరిస్తున్నారు. జాతీయ స్థాయిలో టాప్ టెన్‌లో నలుగురు ఎంపైర్స్ స్కోరింగ్ జడ్జిలుగా, టెక్నికల్ ఆఫీసర్స్‌గా వ్యవహరిస్తున్నారు. రాబోయే రోజుల్లో వీరంతా అంతర్జాతీయ మ్యాచ్‌లకు కూడా వెళ్లే అవకాశముంది. మన జాతీయ క్రీడ హాకీ అయినా దానికి తగిన ప్రాచుర్యం ఉండడం లేదు. తగిన పబ్లిసిటీ ఇచ్చి గుర్తింపు తెస్తే బాగుంటుంది.

హర్షవర్ధన్, ఆంధ్రప్రదేశ్ హాకీ టీం జనరల్ సెక్రటరీ, ఇంటర్నేషనల్ ఎంపైర్స్ మేనేజర్

రూ.10కే రాగిజావ

రాజమహేంద్రవరం మహిళా ప్రత్యేక కారాగారం ఆధ్వర్యంలో సెంట్రల్ జైలు బయట స్టాల్



సెంట్రల్ జైలు బయట స్టాల్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మహిళా ప్రత్యేక కారాగార అధికారులు అటు మహిళా ఖైదీలకు, ఇటు జనానికి ఉపయుక్తంగా ఉండే విధంగా ఓ చక్కటి ఆలోచన చేశారు. సెంట్రల్ జైలు గేటు వద్ద రాగిజావ స్టాల్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా జైలు సూపరింటెండెంట్ సీహెచ్ వసంత కుమారి మాట్లాడుతూ.. జైళ్ల శాఖ కోస్తాంధ్ర ప్రాంత డీఐజీ ఎంఆర్ రవికిరణ్ ఆదేశాలతో ఈ స్టాల్‌ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి 8.30గంటల వరకూ రాగిజావ, ఉడకబెట్టిన వేరుశెనగ, శెనగ, వెజిటెబుల్ సలాడ్‌ని రూ.10కి, బెల్లం రాగిజావ రూ.15కి అందిస్తున్నామన్నారు. మహిళా ఖైదీలతో తయారు చేయించడంతో పాటు విక్రయాలు కూడా వారే చేస్తారని ఆమె చెప్పారు. ఇప్పటికే జైలు బేకరీలో తయారైన బ్రెడ్‌లు, బిస్కెట్లు, సుదార్ పిండి వంటలు ప్రిజన్ కేఫ్‌లోను, ఆరుబయట కూరగాయలు మహిళా ఖైదీలతో విక్రయాలు జరిపిస్తున్నామని చెప్పారు. మహిళా ఖైదీలు విడుదలయిన తర్వాత ఇలాంటి అనుభవం వారి జీవనోపాధికి పని చేస్తుందన్నారు. మహిళా కారాగార ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా మహిళా ఖైదీలను ప్రోత్సహించాలని కోరారు. మంచి ఆహార అలవాట్ల వల్ల ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందని, రోగాలతో ఇబ్బంది పడే పరిస్థితుల నుంచి దూరంగా ఉండొచ్చని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్య ప్రభ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జైలర్ పావని, డిప్యూటీ జైలర్ కె.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



కిలో వెండి రూ.లక్ష

- 10 గ్రాముల బంగారం రూ.80,700
- ఆల్‌టైం రికార్డుకు దిశగా వెండి ధర
- ధరల్లో పోటీపడుతున్న బంగారం, వెండి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఆల్‌టైం రికార్డుకు వెండి ధర చేరింది. వెండి వ్యాపారంలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజిది. ఊహించినట్టుగానే కిలో వెండి ధర రూ.లక్ష అయింది. రాజమహేంద్రవరం మార్కెట్‌లో గురువారం కిలో వెండి ధర రూ.లక్షగా ఉంది. జనవరి 1న రూ.88,400గా ఉన్న కిలో వెండి ధర 50 రోజుల్లో రూ.11వేల600 పెరిగి రూ.లక్ష అయిపోయింది. లక్షణంగా నిలిచింది. జనవరినుంచి క్రమంగా ఈ ధరలు పెరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. బంగారం ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. 10గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర 80,700 అయింది. 24 క్యారెట్ ధర రూ.88,040 అయింది. మరో రూ.12వేలు పెరిగితే ఇదీ రూ.లక్ష కానుంది. ఈ ధరలు ఇలా విపరీతంగా పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే బాగా కొనుగోలు చేసుకున్నవారు మాత్రం సంతోషంగా ఉన్నారు.

డెల్టా కాలువలకు 8700 క్యూసెక్కులు

ధవళేశ్వరం,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచిడెల్టా కాలువలకు 8700 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. తూర్పు డెల్టాకు 2600 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4400 క్యూసెక్కుల చొప్పున జలాలను విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరంవద్ద గోదావరినీటిమట్టం స్వల్పంగా పెరుగుదల నమోదు చేసుకుని 9.65 అడుగులకు చేరుకుంది. సీలేరునుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 4వేల క్యూసెక్కులు, బైపాస్‌మార్గం ద్వారా 3వేల క్యూసెక్కులు విడుదలవుతుండగా గోదావరిలో నీటి లభ్యత 8700 క్యూసెక్కులుగా ఉంది.

కోనసీమ కపిల్‌దేవ్..

ఇక లేరు

- అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్‌కు పితృవియోగం
- ఖేల్‌రత్న అవార్డు స్వీకరణ చూడకుండానే తనువు చాలించిన కాశీవిశ్వనాథం



అర్జున అవార్డు ప్రకటించినప్పుడు కుమారుడికి స్వీటు తినిపిస్తున్న కాశీవిశ్వనాథం(ఫైల్)

అమలాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎందరో వ్యాయామ ఉపాధ్యాయులను..వివిధ క్రీడల్లో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను తీర్చిదిద్దడంలో నిరంతర శ్రామికుడిగా పేరొందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం గురువారం గుండెపోటుతో మృతి చెందారు. క్రీడలంటే ఆయన ఎంతో మక్కువతో ఉండేవారు. చివరి కోరిక తీరకుండానే తనువు చాలించడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కాశీవిశ్వనాథం పోలికల్లోగానీ, క్రీడా నైపుణ్యంలో ఆయనచూపే ప్రతిభాపాటవాలతో ఆయన్ను కోనసీమ కపిల్‌దేవ్‌గా పిలుస్తారు.

ఆ కోరిక తీరకుండానే..

అమలాపురం పట్టణానికి చెందిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ఖేల్‌రత్న అవార్డుకు ఎంపికయ్యారు. వివిధ దేశాల్లో జరుగుతున్న బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లడం వల్ల ఆ అవార్డును ఇప్పటివరకు ఆయన స్వీకరించలేదు. ఈ అవార్డు స్వీకరణకు గురువారం సాయంత్రం ముహూర్తంగా నిర్ణయించుకున్నారు. ఇప్పటికే సాత్విక్ ఢిల్లీలోనే ఉన్నారు. అవార్డు స్వీకరణ కార్యక్రమాన్ని కనులారా వీక్షించాలని తల్లి రంగమణి, తండ్రి కాశీ విశ్వనాథ్ గురువారం ఉదయం ఢిల్లీ బయలుదేరేందుకు అమలాపురం నుంచి పయనమయ్యారు. కారులో ఎయిర్‌పోర్టుకు బయలుదేరిన కొన్నిక్షణాల్లోనే కాశీవిశ్వనాథం గుండెపోటు రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తుదిశ్వాస విడిచారు. కన్న కొడుకు ఖేల్‌రత్న అవార్డు స్వీకరించే కార్యక్రమాన్ని తిలకించాలనే ఆయన చివరి కోరిక తీరకుండానే మరణించడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కుటుంబ నేపథ్యం..

అమలాపురం పట్టణంలోని గాంధీబజార్‌కు చెందిన రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పదవీవిరమణ చేశారు. తల్లి రంగమణి జనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రామ్‌చరణ్ టెక్సాస్‌లో ఎంఎస్ చేసి ఎయిర్‌లైన్స్‌లో పని చేస్తున్నారు. చిన్నకుమారుడైన సాత్విక్‌సాయిరాజ్ చదువు కంటే షటిల్ బ్యాడ్మింటన్ ప్రాణంగా భావించి ఎనిమిదేళ్ల పసిప్రాయం నుంచేఆక్రీడకు అంకితమయ్యాడు.

తండ్రే శిక్షకుడు..

సాత్విక్‌కు తండ్రి కాశీవిశ్వనాథం చిన్నతనంనుంచే షటిల్ బ్యాడ్మింటన్‌పై శిక్షణ ఇచ్చారు. కేంద్ర క్రీడామంత్రిత్వశాఖ ప్రకటించిన ఖేల్‌రత్న అవార్డుకు సాత్విక్‌సాయిరాజ్ ఎంపిక కావడం ఎంతో సంతోషం కలిగిందని ఇటీవలే ఓ సందర్భంలో ఆయన వ్యాఖ్యానించారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్దిన ఘనత కాశీది. తన వద్ద శిక్షణ పొందిన పద్దెనిమిదిమంది వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీలుగా పనిచేస్తున్నారు.

అన్నింటా ఆయనే..

కోనసీమ షటిల్ బ్యాడింట్మన్ అసోసియేషన్ కార్యదర్శిగా, అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శిగా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా కాశీవిశ్వనాథం పని చేస్తున్నారు. రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు, జాతీయ వాలీబాల్ పోటీలు, క్రికెట్ పోటీలకు ఆయనే నాయకత్వం వహించారు.

ఉమ్మడి తూర్పు జిల్లాలో 12 ఎంపీడీవో పోస్టుల ఖాళీలు

- జడ్పీ సీఈవో లక్ష్మణరావు

మండపేట,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి సంబంధించి తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, మన్యం జిల్లాల్లో మొత్తం 12 వరకు ఎంపీడీవోల పోస్టులు ఖాళీగా ఉన్నాయని జడ్పీ సీఈవో ఎస్వీవీ లక్ష్మణరావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ముగిసిన తర్వాత ఆయా మండలాలకు సంబంధించి ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు. జిల్లాలో మండలపరిషత్‌ల పనితీరు మెరుగుకోసం ప్రతినెలా రెండు మండలాల్లో పర్యటించి అక్కడి ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. మండపేట మండల పరిషత్ కార్యాలయాన్ని సీఈవో గురువారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ తీరు బాగుందని కితాబిచ్చారు. రికార్డుల నిర్వహణ, మండల స్థాయిలో ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరాతీశారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, కార్యాలయ ఏవో, వెల్లంకి నాగేంద్ర ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జనార్దన్, జూనియర్ అసిస్టెంట్ గోపాల్ ఉన్నారు.

సామర్లకోట భీమేశ్వరాలయానికి.. 12 నదుల పవిత్ర జలాల చేరిక



పవిత్ర నదుల జలాలను ప్రదర్శనగా తెస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 10 గంటల నుంచి వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య జరగనున్న లింగోద్భవకాల పూజల్లో భీమేశ్వర శివలింగానికి అభిషేకించేందుకు దేశంలోని 12 పవిత్ర పుణ్యనదులనుంచి సేకరించిన పవిత్ర జలాలు గురువారం సాయంత్రం సామర్లకోట ఆలయానికి చేరుకున్నాయి. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ఈ పవిత్ర జలాలతో పిఠాపురంరాజావారి గోత్రనామాలతో స్వామికి అభిషేకించనున్నట్లు ఆలయ ఈవో నీలకంఠం, ఆలయ పండితులుసోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న తెలిపారు. పవిత్ర జలాలను ఆలయమర్యాదలతో మంగళవాయిద్యాలు వేదమంత్రోచ్చారణలమధ్య ఆలయంలోకి చేర్చి స్వామి గర్భాలయంలో భద్రపరిచారు.

ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరానికి ఆఖరి స్థానం

అన్నవరం, ఫిబ్రవరి 20: ఆలయాల్లో భక్తులకు సంతృప్తికరమైన సేవలందించాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ప్రభుత్వం ఆలయాల్లోని ముఖ్య కూడళ్లవద్ద క్యూఆర్ కోడ్ ప్రవేశపెట్టి భక్తుల చరవాణిల ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టగా అన్నవరం దేవస్థానం చివరి స్థానంలో నిలిచింది. తొలి దశలో ఏడు ప్రధాన దేవాలయాల్లో వీటిని ఏర్పాటు చేసి సర్వే చేపట్టగా అన్నవరం దేవస్థానం 7వ స్థానంలో నిలిచింది.

పనిచేసేవారే..

వర్సిటీలో ఉంటారు

- బాధ్యతలు స్వీకరించిన నన్నయ వీసీ ప్రసన్నశ్రీ
- కళలకు ప్రోత్సాహం.. పరిశోధనలకు ప్రాధాన్యం
- నైపుణ్యాభివృద్ధిని విద్యార్థులకు చేరువ చేస్తా
- ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడి



వీసీకి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న రిజిస్ట్రార్ సుధాకర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆమె గిరిజన కుటుంబంలో పుట్టారు. కష్టపడి చదువుకున్నారు. 23భాషలు మాట్లాడతారు. ఇంతింతై అన్నట్టు ఎన్నో పదవులను చేపట్టి నన్నయ వర్సిటీ ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ నియమితులయ్యారు.ఈ ప్రయాణంలో ఆమె పడిన కష్టాలు.. వర్సిటీని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడంలో ఏ విధమైన ప్రణాళికతో ముందుకు వెళ్తారు? అనే అంశాలపై గురువారంబాధ్యతలు స్వీకరించిన ఆమెను ఆంధ్రజ్యోతి పలకరించగా ఇలా చెప్పుకొచ్చారు.

రాజమహేంద్రవరం కోడలినే..

నన్నయ వీసీగా రావడం ఆనందంగా ఉంది. నేను రాజమండ్రి కోడలినే. మా మామగారు.. మా అల్లుడు ఈ ప్రాంతంవారే. మంచితనం, ప్రేమ, ఆదరణ, మర్యాదలకు ఈ ప్రాంతం పెద్దపీట వేస్తుందని అందరికీ తెలిసిన సత్యమే. నాకు కళలంటే ఇష్టం.. సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో అవకాశంమేరకు కళలు ప్రోత్సహించేందుకు కృషి చేస్తా.

పనిచేసేవారు మాత్రమే ఉంటారు..

నాసిబ్బందే నా కుటుంబం. నేను పనిచేస్తాను.. సిబ్బంది అందరితో పనిచేయిస్తా. పనిచేసేవారు మాత్రమే విశ్వవిద్యాలయంలో ఉంటారు. పనిదొంగలను ఉంచుకునే అవకాశమే లేదు. పనిచేసే వారికి తొలి ప్రాధాన్యం. వర్సిటీ గురించి అంతా తెలుసుకునే వచ్చా. నాకేం తెలియదని అనుకోవద్దు.

ఇక్కడా పరిశోధనలు చేస్తా..

విశ్వవిద్యాలయంలోని వనరులను పరిశీలించి ఇక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాక పరిశోధనలను ప్రోత్సహించే విషయమై దృష్టిసారిస్తా. పరిశోధనలు చేసేందుకు ఇక్కడగల అవకాశాలు, సంభావ్యత, వాటివల్ల ఈ ప్రాంతానికి ఎంత మేరకు మేలు జరుగుతుంది మొదలైన విషయాలను పరిశీలించి పరిశోధనల వైపు దృష్టిసారిస్తా.

గిరిజన మహిళకు తొలి అవకాశం

రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజన మహిళను విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా తొలిసారిగా కూటమి ప్రభుత్వం నియమించింది. ప్రతిభ ఆధారంగా వీసీలను నియమించామని తెలుపుతూ తనగురించి సీఎంచంద్రబాబు ప్రస్తావించడం ఎంతో సంతోషం కలిగించింది. నాకు ఇచ్చిన ఈ అవకాశంతో మూడేళ్లపాటు వీసీగా మరింత బాధ్యతగా పనిచేస్తా.

గిరిజన బిడ్డగా కష్టం విలువ తెలుసు

గుంటూరు జిల్లా స్టూవర్టుపురం గిరిజన ప్రాంతంనుంచివచ్చా. చదువుకోవడానికే ఎన్నో కష్టాలుపడ్డా. అన్నీఎదుర్కొని నేడు వీసీగా ఎదిగా. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కష్టాలను అధిరోహించి ఉన్నతస్థానాలకు చేరుకోవాలి. గిరిజన బిడ్డగా కష్టం విలువతెలిసిన నేను తోటి మనిషికి సాయం చేయడానికి ముందుంటా.

19 గిరిజన భాషలకు లిపి రూపొందించా..

నేను 23 భాషలు మాట్లాడతా. ఆదివాసీల కోసం 19గిరిజన భాషలకు లిపి రూపొందించా.ఆ సందర్భంలో ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి. నీ కాళ్లల్లో ఎన్ని ముళ్లు గుచ్చుకున్నాయో అంటూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం నన్ను ఉద్దేశించి ఒక సందర్భంలో అనడం మర్చిపోలేను.

వీసీగా ప్రసన్నశ్రీ బాధ్యతల స్వీకరణ

అందరి సహకారంతో నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్న శ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీగా గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. నన్నయ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, ప్రార్థనల మధ్య బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, నన్నయ కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌ల అధ్యాపకులు, నన్నయ అనుబంధ కళాశాలల నిర్వాహకులు వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

అర్ధరాత్రి దారి కాచి... మెడపై కత్తి పెట్టి!

- బైక్‌తో సహా మూడు సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన నలుగురు దారి దోపిడీ దొంగలు అరెస్ట్
- చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న సర్పవరం పోలీసులు


నిందితులతో సర్పవరం సీఐ పెద్దిరాజు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని అర్ధరాత్రి దారి కాచి మెడపై కత్తి పెట్టి బెదిరింపులకు గురి చేసి బైక్‌తో సహా మూడు సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన నలుగురు దొంగలను సర్పవరం పోలీసులు అరెస్ట్ చేసి, నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం సర్పవరం సీఐ బి.పెద్దిరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ శ్రీనగర్‌కు చెందిన సత్తి వివేకానందరెడ్డి ఆదిత్య కాలేజీహాస్టల్‌లో ఆఫీస్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి టీ తాగేందుకు బైక్‌పై డీమార్ట్ ప్రాంతానికి వెళ్లగా, టీ కొట్టు మూసి వేసి ఉండడంతో దుమ్ములపేట డైరీఫారమ్ సెంటర్ వైపు సూర్య బార్ రెస్టారెంట్ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ మార్గమధ్యలో కాకినాడ డైరీ ఫారమ్ సెంటర్‌కు చెందిన యెలెపే మెగా శ్యామ్, రామకృష్ణారావుపేటకు చెందిన డెక్కాతి ఎల్లయ్య, సంజయ్‌నగర్ పర్లోపేటకు చెందిన కొత్తూర్తి వీరబాబు, రామకృష్ణారావుపేటకు చెందిన షేక్ ఇబ్రహీమ్‌లు అనే నలుగురు యువకులు దారికి అడ్డంగా నిలబడి బైక్‌ను ఆపారు. బాధితుడు నుంచి బైక్ తాళం లాక్కుని, బెదిరించి మెడపై కత్తి పెట్టి మోటార్ సైకిల్‌పై అక్షర స్కూల్ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ చంపుతామని బెదిరించి దాడి చేసి అతడి వద్ద ఉన్న బైక్, శ్యామ్‌సంగ్ ఎఫ్ 40 సెల్‌ఫోన్, రెండు రెడ్‌మీ ఫోన్లు, బోట్ కంపెనీ ఇయర్ బడ్స్ దౌర్జన్యంగా లాగేసుకుని పరారయ్యారు. బాధితుడు 18వ తేదీన సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో నేతృత్వంలో సర్పవరం సీఐ బి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నలుగురు నిందితులు కాకినాడ దుమ్ములపేట కూరకాయల మార్కెట్ వద్ద ఉండగా పోలీసులు దాడి చేసి పట్టుకుని అరెస్ట్ చేశారు. చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. నిందితులను చాకచక్యంగా సత్వరంగా పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న ఎస్ఐ శ్రీనివాస్, క్రైం సిబ్బంది, ఏఎస్ఐ నాగేశ్వరరావు శ్రీనివాస్, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, ప్రసాద్, పీసీలు వెంకటరత్నం,దుర్గాప్రసాద్, అనిల్, కిషోర్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన ఏపీ ప్రభుత్వ పెద్దలు


ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిని కలిసిన సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల అనంతరం జాప్యం లేకుండా పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ పెద్దలు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు తదితరులు జలశక్తి మంత్రిని కలిశారు. పోలవరంతో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టు పనుల పునఃప్రారంభానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఏపీ అభివృద్ధి పోలవరం ప్రాజెక్టుతో ముడిపడి ఉందని వివరించారు. అపారమైన జలవనరులు ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకునేలా సహకరించాలని మంత్రిని కోరారు.

ఒకరి పాపం 12 మందికి చుట్టుకుంది!

- బయటపడుతున్న కాకినాడ జీజీహెచ్ మేనేజర్ లీలలు
- విధుల నుంచి చిరుద్యోగుల తొలగింపు

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో పరిపాలనా విభాగ మేనేజర్‌గా పనిచేసిన నరసింగరావ్ అప్పట్లో చేసిన పాపం 12 మంది చిరుద్యోగులకు చుట్టుకుంది. శాఖాపరమైన విచారణ, దర్యాప్తు అనంతరం ఆ చిరుద్యోగులను గురువారం విధుల నుంచి తొలగించారు. 2020-2021లో కొవిడ్ నియంత్రణలో లేని సమయంలో తన తెలివితేటలతో లేని ఉద్యోగాలను సృష్టించి జీజీహెచ్‌లో నియామక ప్రక్రియకు తెరతీసిన మేనేజర్ నరసింగరావును అధికారులు విచారణానంతరం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆయన పై అధికారిణి (రాజమహేంద్రవరం) శాఖాపరంగా ఆయనపై సరైన చర్యలు చేట్టకపోవడంతో ఆయన త్వరలోనే తిరిగి ఉద్యోగం పొందేందుకు పావులు కదుపుతున్నాడు. అయితే నరసింగరావ్ చేసిన పాపానికి 12 మంది బలవ్వడం మిగతా ఉద్యోగులను, ఉద్యోగ సంఘాలను కలచి వేసింది. ఉద్యోగం కోల్పోయినవారిలో ఇద్దరు రెగ్యులర్ ఫార్మసిస్టులు, మరో ఇద్దరు కాంట్రాక్ట్ ఫార్మసిస్టులు, ఇద్దరు ఫిజియోథెరపిస్టులు, నలుగురు ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఒక థియేటర్ అసిస్టెంట్, ఒక ఎలక్ట్రీషియన్ ఉన్నారు. ఈ విషయంపై అధికారులు తొలగింపునకు గురైన వారి కోసం కలెక్టర్‌కు విన్నవించగా వారికి మరి ఎక్కడైనా నియామకం చేపట్టే అవకాశం గురించి పరిశీలించాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. ఈ విషయంపై జీజీహెచ్ అధికారులు, ట్రెజరీ అధికారులతో కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. చిరుద్యోగుల జీవితాలతో ఆడుకుని సస్పెండ్‌కు గురైన నరసింగరావును పూర్తిగా ఉద్యోగం నుంచి తొలగించాలని పలు ఉద్యోగసంఘాలు కోరుతున్నాయి.

డిప్యూటీ సీఎం పవన్‌పై అనుచిత పోస్టులు

కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర, తప్పుడు పోస్టులు పెడితే ఉపేక్షించబోమని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ హెచ్చరించారు. డిప్యూటీ సీఎం పవన్ కుటుంబ సభ్యులతో కుంభ మేళాలో పుణ్యస్నానాలు ఆచరించిన విషయం తెలిసిందే. ఈ ఫొటోలను కొందరు మార్ఫింగ్, బాడీ షేమింగ్ చేయడంతోపాటు, మహిళలను కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ జనసేన నాయకులు ఫిర్యాదు చేశారని ఎస్పీ తెలిపారు. భార్గవ్. ఆర్, ఎన్‌వీఆర్ భక్తుడు, దిలోన్ వోల్ఫ్10 ఐడీల నుంచి ఉన్న పోస్టుల ఫొటోలను ఫిర్యాదుతో జత చేయడం జరిగిందన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితులను గుర్తించి కోర్టులో ప్రవేశ పెడతామన్నారు.

ముగిసిన ఆక్టోపస్ శిక్షణ

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద నిరోధక సంస్థ అయిన ఆక్టోపస్ కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో చేపట్టిన 2 రోజుల శిక్షణ గురువారంతో ముగిసింది. 40 మంది కమాండోలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ సి.రాజారెడ్డి నేతృత్వంలో ఆర్ఐలు ఎస్.మురళీకృష్ణ, కె.మహేష్ ఆధ్వర్యంలో ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడితే తిప్పి కొట్టే విధానాలపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, డీఎంఈ, డా.ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డా.డిఎస్‌విఎల్ నరసింహం ఆదేశానుసారం వైస్ ప్రిన్సిపాల్ డా.శశి, ఫోరెన్సిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డా పి. ఫణికిరణ్, ఆర్ఎంసీ లైబ్రేరియన్ లక్ష్మణ్ రెడ్డి, కళాశాల తరుపున శిక్షణా కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. ఇలాంటి ఉన్నత విద్యను అందించే కళాశాలల్లో ఇటువంటి శిక్షణలనివ్వడం తప్పనిసరి అని ఏఎస్పీ పేర్కొన్నారు.

భర్తను కాదనుకొని.. మరొకరితోనూ పొసగక!

ఉరి వేసుకొని మహిళ మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మంచిర్యాలకు చెందిన ఓ మహిళకు అదే ప్రాంతానికి చెందిన దేవయ్యతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. మూడేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. ఏడాది తర్వాత రాజమండ్రికి చెందిన అవివాహితుడు శరత్ కుమార్‌తో సామాజిక మాధ్యమం ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ఏడాది కొనసాగిన తర్వాత ఆమె పిల్లలను తీసుకుని రాజమండ్రి వచ్చేసింది. అప్పటి నుంచి హౌసింగ్ బోర్డులో అద్దెకు తీసుకున్న ఇంట్లో ఆమె, శరత్ కుమార్ సహజీవనం చేస్తున్నారు. అయితే 3 నెలల నుంచీ వీరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో తాను చచ్చిపోతానంటూ శరత్‌తో చెప్పింది. గొడవ జరిగినప్పుడు ప్రతిసారీ ఆమె అలా బెదిరించడంతో ఇప్పుడు కూడా అదే మాదిరి అనుకొని శరత్ కుమార్ ఉద్యోగానికి వెళ్లిపోయాడు. గురువారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేసరికి ఆమె ఉరికి వేలాడుతూ ఉంది. బొమ్మూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మరణించడంతో... మనస్తాపానికి గురై!

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ విశ్రాంత ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక నరసన్నగర్, సిరి అపార్ట్‌మెంట్‌కు చెందిన గోపిశెట్టి నాగేశ్వరరావ్ (65)కు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా నాగేశ్వరరావ్ కాకినాడ పశుసంవర్థక శాఖ కార్యాలయంలో టెక్నీషియన్‌గా పని చేసి 5 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందాడు. కుమారుడు, కుమార్తె విదేశాల్లో స్థిరపడడంతో నాగేశ్వరరావు తన భార్య విజయలక్ష్మితో కలిసి కాకినాడలో ఉంటున్నారు. అయితే ఇటీవల నాగేశ్వరరావ్ తల్లి మరణించడంతో తల్లితో ఎంతో అనుబంధం ఉండడంతో తీవ్ర మనస్తాపానికి గురై అతడిలో అతడే మదనపడిపోయి, పరాకు మాట్లాడేవాడు. ఈ నేపథ్యంలో విజయలక్ష్మి తన భర్తను మానసిక వైద్యుడికి చూపిద్దామనుకున్న తరుణంలో గురువారం ఆమె నిద్రిస్తున్న సమయంలో నాగేశ్వరరావ్ గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు బెల్టుతో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన విజయలక్ష్మి పొరుగింటి వారి సహాయంతో జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. టూటౌన్ ఎస్ఐ ఎం వెంకటేశ్వరరావ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శానిటరీ మేస్త్రీపై వ్యక్తి దాడి

పిఠాపురంలో విధులు బహిష్కరించి పారిశుధ్య కార్మికుల ఆందోళన


పిఠాపురంలో ఆందోళన నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది, కార్మికులు

పిఠాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో విధుల్లో ఉన్న శానిటరీ మేస్త్రీపై ఒక వ్యక్తి దాడి చేయడంతో పాటు వెంబడించి మరీ మరోమారు దాడి చేశాడు. ఈ సంఘటనకు నిరసనగా పారిశుధ్య కార్మికులు గురువారం విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ మేస్త్రీగా పనిచేస్తున్న పొట్నూరి పైడిరాజు 24వ వార్డు పక్షలు మర్రిచెట్టు ఏరియాలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను బుధవారం సాయంత్రం పర్యవేక్షిస్తున్నారు. ఆ సమయంలో నాగేశ్వరరావు అనే వ్యక్తి వచ్చి దాడి చేయడంతో పాటు కులదూషణకు దిగాడు. అక్కడ నుంచి చెత్త తీసుకువెళ్తున్న ట్రాక్టర్‌ను వెంబడించి వచ్చి మరీ మున్సిపల్ కార్యాలయం వద్ద మరోమారు దాడికి దిగాడు. ఈ సంఘటనపై పైడిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేస్త్రీపై దాడి ఘటనకు నిరసనగా మున్సిపల్ పారిశుధ్య విభాగం సిబ్బంది, కార్మికులు గురువారం విధులు బహిష్కరించారు. దాడి చేసిన వ్యక్తిని తక్షణం అరెస్టు చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. అతడిని అరెస్టు చేసే వరకూ తాము విధులకు హాజరుకాబోమన్నారు. వారి ఆందోళనతో పిఠాపురం పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ నిలిచిపోయింది. ఎక్కడ చెత్తాచెదారం అక్కడే ఉండిపోయింది.

భార్య, మామపై కత్తితో దాడి

- దురాగతానికి పాల్పడ్డ అల్లుడు
- అక్కడికక్కడే భార్య మృతి, మామకు తీవ్ర గాయాలు
- కుటుంబ కలహాలే కారణం


రక్తపు మడుగులో పడివున్న కృష్ణతులసి మృతదేహం

కొవ్వూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్యను, మామను కత్తితో అల్లుడు దాడిచేసిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి బంగారమ్మపేటలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే. కొవ్వూరు మండలంలోని వాడపల్లి బంగారమ్మపేటకు చెందిన అడ్డాల నాగయ్యకు నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె, కుమారుడు అనారోగ్యంతో మృతిచెందగా, మిగతా ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. ఇందులో మూడో కుమార్తె గంధ్ర కృష్ణతులసి (37)కు కృష్ణా జిల్లా తిరువూరు సమీపంలోని రాజుగూడెంకి చెందిన గంధ్ర మురళీకృష్ణ చౌదరితో 16 సంవత్సరాల క్రితం రెండో వివాహం జరిగింది. అయితే మురళీకృష్ణ, కృష్ణతులసి కొంత కాలం సఖ్యంగానే ఉన్నారు. అనంతరం గొడవలు జరగ్గా కృష్ణతులసి పుట్టింటికి వచ్చేసింది. గత నాలుగు నెలలుగా భార్యాభర్తలు విడివిడిగా ఉంటున్నారు. మురళీకృష్ణ బంగారంపేట గోదావరి ఏటిగట్టుపై వద్ద గల బస్‌షెల్టర్ పక్కన కొబ్బరి బొండాల షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో తండ్రి నాగయ్యతో కలిసి కృష్ణతులసి గోదావరి ఏటిగట్టు కింద కట్టిన గేదెల వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా, కొబ్బరి బొండాల షాపు వద్ద ఉన్న భర్త మురళీకృష్ణను చూసి తన తండ్రి వద్ద గతంలో అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వాలని కోరింది. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన మురళీకృష్ణ తన చేతిలో ఉన్న కొబ్బరి బొండాల కత్తితో దాడి చేయగా కృష్ణతులసి అక్కడికక్కడే మృతిచెందింది. ఆ తర్వాత వచ్చిన మామ నాగయ్యనూ మెడపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు కొవ్వూరు డీఎస్పీ జీ. దేవకుమార్, పట్టణ ఎస్ఐ కె. జగన్మోహనరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన నాగయ్యను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రి లో చేర్పించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణతులసికి మొదటి భర్తకు ఒక కుమారుడు ఉన్నాడు. పని నిమిత్తం భీమవరం వెళ్లాడు. మృతురాలి సోదరుడు అడ్డాల సూర్యభాస్కర్ అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన అడ్డాల నాగయ్య

చైతన్యరాజుకు మాతృవియోగం

- నివాళులర్పించిన ప్రముఖులు


లక్ష్మీకాంతమ్మ

అమలాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ వైద్య విద్యాసంస్థల అధినేత కలిదిండి వీరవెంకట సత్యనారాయణరాజు (చైతన్యరాజు)కు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి లక్ష్మీకాంతమ్మ (87) గురువారం మధ్యాహ్నం అమలాపురంలోని కిమ్స్ వైద్యకళాశాలలో ఆకస్మికంగా మృతిచెందా రు. ఆమె భర్త సత్యనారాయణరాజు ఇదివరకే మరణించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారు. వారిలో చైతన్యరాజు పెద్దకుమారుడు. కాగా రెండో కుమారుడైన వెంకట్రామరాజు కొంతకాలం క్రితం మృతిచెందారు. ఆమెకు వరలక్ష్మి, పార్వతి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వృద్ధాప్యంలో ఉన్న లక్ష్మీకాంతమ్మ కిమ్స్‌లోని వైద్యుల సంరక్షణలోనే కొన్నిరోజులుగా ఉన్నారు. లక్ష్మీకాంతమ్మ భౌతికకాయానికి శుక్రవారం రాజమహేంద్రవరంలోని గోదావరి నదీ తీరాన అంత్యక్రియలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. లక్ష్మీకాంతమ్మ మరణ వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ప్రముఖులు పెన్మెత్స జగ్గప్పరాజు, దంతులూరి వాసురాజు, బీజేపీ నాయకులతో సహా అనేకమంది పరామర్శించి లక్ష్మీకాంతమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.

దేవరపల్లిలో జర్మన్ ప్రతినిధుల బృందం

- మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన


పల్లంట్లలో ఆకుకూరలు సాగు చేస్తున్న సత్యవర్థినిని వివరాలు అడుగుతున్న బృంద సభ్యులు

దేవరపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో జర్మన్ ప్రతినిధుల బృందం గురువారం పర్యటించింది. దేవరపల్లి మండలంలోని పల్లంట్ల, యర్నగూడెం, కురుకూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పండించే పంటల గురించి ఆ బృందం సభ్యులు రైతులను అడిగి తెలుసుకున్నారు. నలుగురు సభ్యులతో కూడిన ఈ బృందంలో ఫౌండేషన్ ఆన్‌ఫ్యూచర్ ఫార్మింగ్ తరఫున జాస్పర్ జోర్డాన్, బెన్నెడిక్ట్ హెర్లిన్, పోర్చుగల్‌కు చెందిన ప్రాజెక్టు ఎర్త్ ప్రతినిధి డియోగో కౌటినో, అటెలియర్‌ఫుడ్ సిస్టమ్ చేంజ్ ప్రతినిధి లూకస్ కేప్లో ఉన్నారు. దీనిలో భాగంగా యర్న గూడెంలో రైతు గద్దే మునేశ్వరరావు తన తొమ్మిది ఎకరాల్లో పప్పుధాన్యాలు, 35 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్న పొలాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పాటించడానికి మీ లక్ష్యమేమిటని అడిగారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు భూసారాన్ని పెంపొందిం చుకోవచ్చని, అలాగే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని రైతు మునేశ్వరరావు జర్మన్ బృందానికి తెలిపారు. తమ ప్రకృతి వ్యవసా యం ద్వారా పండించే పంటకు స్వయంగా ప్రకృతి సాగు పదార్థాలైన ద్రవజీవామృతం తయారు చేసుకోవడం, డ్రోన్ పిచికారీ సాంకేతికత జర్మన్ బృందాన్ని ఆకట్టుకుంది. పల్లంట్లలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కౌలురైతు సీహెచ్. సత్యవతి ఎకరం భూమిని కౌలుకు తీసుకుని అన్ని రకాల ఆకుకూరలు, ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తూ అధికలాభాలు సాధిస్తున్న అంశాన్ని జర్మన్ బృందాన్ని ఆకట్టుకుంది. వీరితోపాటు రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు ప్రకాశ్‌రావు, శ్రీనివాసరావు, ఏపీసీఎన్ఎఫ్ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వలి, హుమాయున్, యశ్వంత్‌రెడ్డి, దేవరపల్లి మండల ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రతినిధులు సీతాదేవి, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు ఉన్నారు.

వృద్ధ దంపతులను మభ్యపెట్టి... ఆపై బంగారం దోచుకెళ్లి

- నిందితుడి అరెస్టు


దొంగను అరెస్టు చేసిన ఎస్ఐ

కొత్తపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట శివారు పనసలదొడ్డికి చెందిన గుబ్బల వెంకటేశ్వరరావు ఇంటికి ఒక అగంతకుడు వచ్చి మీకు బియ్యం యోజన కింద లోన్ వచ్చిందని, తాను సచివాలయం నుంచి వచ్చానని చెప్పి నమ్మబలికాడు. దాంతో వారిద్దరినీ ఆ అగంతకుడు మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని స్థానిక కమ్మిరెడ్డిపాలెం మసీదుసెంటర్‌కు తీసుకుకొచ్చి దించాడు. ఇక్కడే కూర్చోండి మీ ఇంటికి వెళ్లి ఆధార్ జిరాక్స్ తీసుకుని వస్తానని తిరిగి మళ్లీ పనసల దొడ్డిలో వారు ఉంటున్న ఇంటికి వెళ్లాడు. మీ నాన్నకు లోను వచ్చిందని మీ ఆధార్‌కార్డు, ఫొటో కావాలని వారి కుమార్తెను అడగ్గా ఆమె ఆధార్‌కార్డు తెచ్చిఇచ్చింది. ఫొటో లేదని చెప్పగా , అయితే నేను ఫొటో తీసుకుంటానని చెప్పి మీ మెడలో ఉన్న చైన్, ఉంగరం ఫొటోలో రాకూడదు, వాటిని తీసి పక్కన పెట్టమని చెప్పాడు. ఆ తర్వాత ఫొటో తీసినట్టు నమ్మించి పక్కన పెట్టిన కాసు బంగారం చైను, అరకాసు ఉంగరాన్ని జేబులో పెట్టుకుని అక్కడ నుంచి పరారయ్యాడు. దీంతో మోసం జరిగిందని గ్రహించిన వృద్ధ దంపతులు కొత్తపేట పోలీసులకు సమాచారం అందించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు రాజోలు మండలం శివకోడుపాలానికి చెందిన యల్లమిల్లి వెంకటరమణ అలియాస్ గ్రాబియేల్, అలియాస్ కిషోర్‌గా గుర్తించారు. నిందితుడ్ని బుధవారం రాత్రి బోడిపాలెం వంతెన సమీపంలో పట్టుకుని బంగారాన్ని రికవరీ చేసి అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా నిందితుడిపై గతంలో ఈ ప్రాంతంలోనే ఇటువంటి చోరీలకు సంబంధించి 22 కేసులు ఉన్నాయని ఎస్ఐ చెప్పారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి


నాగేంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

గండేపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామపరిధిలోని ఒక పొలంలో రంగంపేట మండలం పెద రాయవరం గ్రామానికి చెందిన కాకర్ల నాగేంద్ర (34) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పోలీసుల సమాచారం ప్రకారం నాగేంద్ర రాయవరం గ్రామం నుంచి పశుగ్రాసం కోసం వచ్చి కోసుకుని మోపులు తీసుకుని వెళ్తుండగా, పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసు సిబ్బంది, ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్‌సాగర్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించినట్టు ఎస్ఐ శివనాగబాబు తెలిపారు.నాగేంద్రకు భార్య మహేశ్వరి, కూతుళ్లు మోక్షశ్రీ, శ్రీలక్ష్మీసుకన్య ఉన్నారు. కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యుత్ శాఖ అధికారులు వైర్లు చేతికందే ఎత్తులో లేకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కుమారపురంలో కత్తితో దాడి : ఒకరికి గాయాలు


గాయపడిన శ్రీనివాసరావు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం కుమారపురంలో కత్తితో చేసిన దాడిలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలివి. గ్రామానికి చెందిన టీ.రామకృష్ణ భార్యను అదే గ్రామానికి చెందిన టీ.అనంతయ్య పరుష పదజాలంతో దూషిస్తున్నాడు. అయితే అటుగా వెళతున్న రామకృష్ణ సోదరుడు శ్రీనివాసరావు అతన్ని వారించే ప్రయత్నం చేయగా, ఇరువురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహించిన అనంత య్య ఇంట్లో నుంచి కత్తి తెచ్చి శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనలో శ్రీనివాసరావు తలపై తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ గుణశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి | www.andhrajyothy.com

పోస్టాఫీసుల్లో ఆధార్ నవీకరణ కేంద్రాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పోస్టల్ రాజమండ్రి డివిజన్ ఆధ్వర్యంలో ఆధార్ మొబైల్ ఫోన్ అనుసంధానం, నవీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని పోస్టల్ సూపరింటిండెంట్ కోట శేషారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమండ్రి ప్రధాన పోస్టాఫీసుతో పాటు దానవాయిపేట ,ఆర్యాపురం, శ్రీరామ్‌నగర్, ధవళేశ్వరం,కడియం, దార్వపూడి , అనపర్తి, మండపేట,రామచంద్రపురం పోస్టాఫీసులు,ఇతర పోస్టాఫీసుల్లో వందకు పైగా మొబైల్ అప్‌డేట్ కౌంటర్లు రాబోయే వారం రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సమన్యాయమే..న్యాయ సేవాధికార సంస్థ ధ్యేయం

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం అందుబాటులో ఉండాలనే ఆశయంతో 1987లో న్యాయ సేవాధికార సంస్థ చట్టం అమలులోకి వచ్చిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాది దేవిక ఆధ్వర్యంలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని జరిపారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడారు. ఎన్ని చట్టాలు, సంస్కరణలు అమల్లోకి తెచ్చినా ఇంకా మహిళలపై అత్యాచారాలు జరుగు తుండడం అవేదన కలిగించే అంశమన్నారు. సెల్‌ఫోన్ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని మంచిస్థాయికి చేరుకొని తల్లి దండ్రులకు ఆసరాగా నిలవాలని సామాజిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో కేవిఎస్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు మరింత బలోపేతం


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏఎంవో గౌరీశంకర్

రాజానగరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసే దిశగా వర్కర్లు కృషి చేయాలని జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి గౌరీ శంకర్, బొమ్మూరు డైట్ లెక్చరర్ డీఎస్‌వి సత్యనారాయణ అన్నారు. జ్ఞానజ్యోతిలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు రాజానగరం హైస్కూల్లో జరుగుతున్న శిక్షణ తరగతులను గురువారం వారు సందర్శించారు. ఏఎంవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు రాబోయే రోజుల్లో మరింత బలోపేతం కావాలన్నారు. రాబోయే రోజుల్లో అంగన్‌వాడీ వర్కర్స్ నుంచి అంగన్‌వాడీ ఉపాధ్యాయులుగా పేరు మారతాయని మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జ్యోతి ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దుర్గమణి, భూదేవి, డీఆర్పీలు రమేష్, సుమలత, గోవింద కుమారి, సీఆర్పీలు పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టు సభ్యులతో కంబాల శ్రీనివాసరావు

ఛత్రపతి శివాజీ కబడ్డీ టోర్నీ విజేత 'గోకవరం'

గోకవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎండీ లే-అవుట్ ప్రాంగణంలో జరిగిన ఛత్రపతి శివాజీ కబడ్డీ టోర్నమెంట్‌లో గోకవరం టీమ్ విజేతగా నిలిచింది. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామ సేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ నెల 13న ప్రారంభమైన కబడ్డీ పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. గోకవరం, గంగంపాలెం జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గోకవరం టీమ్ గెలుపొందింది. సాధారణంగా ఆటల పోటీలు జరిగినపుడు విజేతగా నిలిచిన జట్టుకు అధికంగా రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు కొంచెం తక్కువ ప్రైజ్‌మనీ ఇవ్వడం చూస్తుంటాం. ఈ టోర్నీలో మాత్రం దానికి భిన్నంగా జరి గింది. విజేత గోకవరం టీమ్‌కు రూ. 25,000, ద్వితీయ విజేత గంగంపాలెం టీమ్‌కు రూ.32,333, తృతీయ విజేత ఫజు ల్లాబాద్ టీమ్‌కు రూ.26,333, చతుర్థ విజేత బావాజీపేట టీమ్‌కు రూ.20,333 నగదు ను విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామ సేన అధ్యక్షుడు శ్రీనివాసరావు ఇచ్చారు.


ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

'కూటమి అభ్యర్థి పేరాబత్తులకు పట్టం కట్టండి'

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి పక్షాన పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంకు తొలి ప్రాధాన్యత ఓట్లు వేసి విజయాన్ని అందించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలో 37 వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నగర ఇన్‌చార్జీ అనుశ్రీ సత్యనారాయణతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. రాజమహేంద్రవరంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపా ధ్యాయులను మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కలిసి కరపత్రాలు అం దించారు. ఆదిరెడ్డి వాసు పిలుపు మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ నగరంలో ఆర్ట్స్ కళాశాల, అల్లు రామలింగయ్య హోమియో కళాశాల, మాతృశ్రీ కళాశాల, మెగా జూనియర్ కళాశాలలలో అధ్యాపకులను కలిసి కరపత్రాలు ఇచ్చారు.

రాజానగరం(ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖర్‌ను మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్రపురం, కానవరం, ముక్కినాడ గ్రామాల్లోని హైస్కూల్స్‌లోని ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ, ప్రభుత్వ వైద్యశాల్లోని ఉద్యోగులను, విద్యావంతులను కలిసి కరపత్రాలు అందజేసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


ముక్కినాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

శివరాత్రి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణనాయక్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ కృష్ణనాయక్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శివరాత్రి వేడుకల సందర్భంగా సమన్వయ శాఖల అధికారులతో ఆయన సమావేశం జరిపారు. ఈ సందర్భంగా కృష్ణనాయక్ మాట్లాడుతూ 26న మహాశివరాత్రి నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని, వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర సమన్వయశాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.1.60 కోట్లు రోడ్ల పాలు!

ఐదు రోడ్ల పనుల్లో నాణ్యతకు చెల్లుచీటి


కంకర లేచిన గుమ్మళ్లదొడ్డి వెళ్లే రహదారి

గోకవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అధ్వానంగా ఉన్న రహదారులను మెరుగుపర్చేందుకు భారీగా నిధులను వెచ్చించింది. రహదారులపై ఎక్కడా గోతులు కనపడకూడదంటూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. గడచిన సంక్రాంతిలోపే పనులు పూర్తి చేయాలంటూ నిర్ణీత సమయం కేటాయించారు. దీంతో చాలాచోట్ల పనులు వేగంగా సాగాయి. చాలాచోట్ల రోడ్లపై ఏర్పడిన గోతు లను పూడ్చారు. ఇదే క్రమంలో గోకవరం మండలంలో కూడా పలు రోడ్లకు మరమ్మతులు చేట్టారు. కానీ వాటి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా విస్మరించారు.

గోకవరం మండలంలో పలు రహదారులకు చేపట్టిన ప్యాచ్‌వర్క్ పను ల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పని పూర్తి చేసిన కొన్ని రోజులకే నాణ్యతా లోపాలు ఎత్తి చూపుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం వెరసి పనుల్లో నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ విషయంలో ఉన్నతాధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు లేకపోలేదు. ఫలితంగా ప్రజాధనం వృధాగా మారి పోయింది.

భారీగా నిధులు: మండలంలో 5 రోడ్లపై మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.1.60 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో గోకవరం-జగ్గంపేట, గుమ్మళ్ళదొడ్డి- అచ్యుతాపురం, వీరలింకపల్లి మీదుగా రంపయర్రం పాలెం-మల్లవరం, తంటికొండ-రాఘవపురం తదితర రోడ్లకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. సంక్రాంతిలోపే దాదాపుగా పనులు పూర్తి చేసేసారు. నిబంధనల ప్రకారం పనులు చేయకుండా తూతూమంత్రంగా పనులు చేపట్టడం వల్ల కొన్నిరోడ్లు ఛిద్రమయ్యాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను మర్చిపోయారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

రేపు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

బిక్కవోలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం రవీంద్ర భారతి స్కూల్‌లో శనివారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు నల్లమిల్లి బుచ్చిరెడ్డి గురువారం తెలిపారు. కాకినాడ ట్రినిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేసామని అన్ని క్యాన్సర్ పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. బలభద్రపురం పరిసర ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెళ్లి వారి ఇంట్లో చోరీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు కాలనీలో ఎస్.బాబూరావు కుటుంబంతో ఉంటున్నారు. కుమారుడి పెళ్లి ఉండడంతో ఇంటికి ఎదురుగా ఉన్న ఇంటిని అద్దెకు తీసుకున్నారు. బుధవారంనాడు రూ.1.50లక్షలు తీసుకొచ్చి బీరువాలో పెట్టానని, అద్దెకు తీసుకున్న ఇంట్లో తన బంధువులతో కలిసి నిద్రించానని తెలిపారు.ఉదయం చూసేసరికి డబ్బు మాయమైందనే ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వేధింపులపై కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తాడితోటకు చెందిన ఒక వివాహిత హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రి లో ఉద్యోగం చేస్తున్నారు. భర్త ఇక్కడ ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. వీరి వివాహానికి ముందు పరిచయం ఉన్న ఒక వ్యక్తి ఫోన్ చేస్తూ వేధిస్తున్నాడంటూ చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు.

దివ్యాంగుల యోగ క్షేమాలపై సర్వే

రంగంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వడిశలేరు గ్రామంలో గురువారం దివ్యాంగుల యోగక్షేమాలు, ఆరోగ్య విషయాలు తదితర పలు అంశాలను తెలుసుకున్నామని మండల న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు మడికి రాంబాబు తెలిపారు. వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు దాట్ల అరుణ అధ్యక్షతన విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలు గురించి వివరించామన్నారు. వడిశలేరు గ్రామం లో 13 మంది దివ్యాంగులను గుర్తించామన్నారు. లీగల్ వాలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 22న రాజమహేంద్రవరం పద్మావతినగర్‌లోని ఎంజీ షోరూం పక్కనున్న గ్రీన్‌ఫీల్డ్ అకాడమీ నెట్స్‌లో ఉదయం 8 గంటల నుంచి జరుగుతుందని కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, సభ్యులు సురవరపు రామన్ సుబ్బారావు, ఇల్లూరి అజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఎంపికలో ఫిజికల్ డిజేబిలిటీ, బ్లైండ్, వీల్‌చైర్, డెఫ్, కేటగిరీలకు సంబంధించిన తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు అర్హులని తెలిపారు. దివ్యాంగ క్రీడాకారులు 92994 01222, 81215 75772 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

మార్చి 20లోగా రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నిక

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ పాలక వర్గం ఎన్నికలు మార్చి 20లోగా పూర్తి చేయాలని మహాజన సభ నిర్ణయించింది. ప్రెస్‌క్లబ్‌లో గురువారం అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ జమాఖర్చులు, సభ్యత్వాల పునరుద్ధరణ, నూతన సభ్యత్వాల స్వీకరణ, ఎన్నికల అడహక్ కమిటీ ఏర్పాటు అంశాలపై చర్చించారు. ప్రెస్‌క్లబ్‌కు రూ.14 లక్షలు డిపాజిట్లు ఉన్నాయని తద్వారా వచ్చే వడ్డీని సంక్షేమానికి వినియోగిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, కార్యవర్గ సభ్యులు తమ అభిప్రాయాలు తెలియజేశారు.



పల్లకడియంలో పుంతరోడ్డు పనులు పరిశీలన

రాజానగరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పల్లకడియంలో రహదారి పనులను పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణారెడ్డి, డీఈఈ ఎస్.దుర్గాప్రసాద్ గురువారం పరిశీలించారు.పల్లకడియం నుంచి ముకుందవరం వరకు దాదాపు 4 కిలోమీటర్ల మేర ప్రస్తుతం ఉన్న పుంత రోడ్డును రూ.3.2 కోట్లు ఉపాధి హామీ నిధులతో సీసీ రహదారిగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అధికారుల వెంట ఏఈ సంపత్‌కుమార్, గ్రామ పెద్దలు చావా ప్రసాద్, బ్రహ్మాజీరావు ఉన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

సమన్వయ కమిటీ సమావేశంలో ఆర్డీవో కృష్ణ నాయక్


కల్యాణోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్, డీఎస్పీ శ్రీకాంత్ తదితరులు

కోరుకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు వచ్చేనెల 9 నుంచి 15 వరకు వైభవంగా నిర్వహించేందుకు సమన్వయంతో పని చేద్దామని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్, అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం కల్యాణ మండపంలో కల్యాణోత్సవాలకు సంబంధించిన సమన్వయ కమిటీ సమావేశం జరిపారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్, అనువంశక అర్చకస్వాములు, పలు శాఖల అధికారులు పాల్గొని పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్డీవో కృష్ణనాయక్ శాఖలవారీగా సమీక్షించారు. మార్చి 9న సాయంత్రం పుట్టమన్ను తెచ్చుట, అంకురార్పణ, ధ్వజారోహణతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమవుతాయన్నారు. మార్చి 10న మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి స్వామి వారి కల్యాణం జరుగుతాయన్నారు. మార్చి 15 శనివారం వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించి వీటి ఏర్పాట్లపై సమీక్షించారు. సమావేశంలో డీఎస్పీ వై. శ్రీకాంత్, సీఐ సత్యకిశోర్, ఎంపీడీవో బత్తిన అశోక్‌కుమార్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. జనసేన నాయకులు కర్రి వీర గణేష్, బదిరెడ్డి దొర, టీడీపీ నాయకులు సుంకర శ్రీను, త్రిమూర్తులు, వైసీపీ నాయకులు బొరుసు బద్రి, వాకా నరసింహారావు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ఎల్ఐసీ ఉద్యోగుల సమ్మె


నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

రాజమహేంద్రవరం కల్చరల్ ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి డివిజన్‌లో గల అన్ని శాఖా కార్యాలయాల్లోని క్లాస్ 3, 4 ఉద్యోగులు, భోజన విరామానికి ముందు చేసిన ఒకగంట వాకౌట్ సమ్మె విజయవంతమైందని ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోరంపూడి సెంటర్ వద్ద గల రాజమండ్రి డివిజన్ కార్యాలయం ముందు జరిగిన ఈ నిరసన ప్రదర్శనను నిర్వహించిన అధ్యక్షుడు మాథ్యూస్, నాయకుడు గన్నెయ్య మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.శ్రీనివాస్, సత్యదేవ, ఈశ్వరరావు,విశ్వనాథ్, బి.శ్రీనివాస్, పట్నాయక్, సాయిబాబా, జిలానీ, మహిళా కన్వీనర్ శిరీష, రాజ్యం,సుజాత, హారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడేలా బోధన చేయాలి


మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ పార్థసారథి

రంగంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడేలా బోధన చేయాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ వి.పార్థసారధి పేర్కొన్నారు. గురువారం రంగంపేట ఉండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి మూడవరోజు అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో పలు ఆటలను ఆహ్లాదంగా డీఆర్ పీలు ఎన్‌వీ రమణాంజలి, వి.త్రిమూర్తిరాజు ఆడించారు. ఈ సందర్భంగా హైస్కూల్ పీడీ శైలు శారీరక, మానసిక వికాసానికి ఉప యోగపడే యోగాభ్యాసాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలిక వైద్యానికి ఆర్థిక సాయం

కడియం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చిన్నవయసులోనే సికిల్ బీటా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న మండపేటకు చెందిన నేలపు అమృతవర్షిణికి కడియపులంక జనసైనికులు రూ. 20వేలు ఆర్థికసాయం చేశారు. ప్రస్తుతం చెన్నై సీహెచ్ఎంసీలో చికిత్స పొందుతున్న అమృతవర్షిణికి ప్రతీ ఆరునెలలకు రూ.25వేలు ఖర్చు అవుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న కూటమి నాయకులు గట్టి సుబ్బారావు, కడియపులంక సర్పంచ్, ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీలు రూ.20 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో మల్లు బాబి, బోడపాటి తాతారావు తదితరులు ఉన్నారు.

నాణ్యతగా పనులు చేయాలి

ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి


బైక్ పర్యటిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్మిస్తున్న రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచించారు. రూరల్ మండలం పిడింగొయ్యి పంచాయతీ పరిధిలో స్థానిక నాయకులతో కలిసి మోటారు సైకిల్‌పై గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మార్ని వాసుదేవరావు, వి రవిబాబు, మట్ట శ్రీనివాస్, కోరాడ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

'రహదారి భద్రత నియమాలు పాటించాలి'

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాలు నడిపేటప్పుడు రహదారి భద్రత నియమాలు పాటించాలని వ్యవసాయ కళాశాల ఆసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ తెలిపారు. కాతేరు వ్యవసాయ కళాశాలలో గురువారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు.వాహనాలు నడిపేటపుడు జాగ్రత్తలు పాటించాలని ఎంవీఐ సీహెచ్ సంపత్ సూచించారు.ఏఎంవీఐ రాధిక మాట్లాడుతూ రహదారి భద్రతపై విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు స్నేహితులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుల డాక్టర్ ప్రవీణ, డాక్టర్ వసంత భాను, డాక్టర్ శేఖర్, శ్రీనివాస్, గంగాధర్ విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

ఆర్ట్స్ కళాశాలలో యువజనోత్సవాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యువతలో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని, దీనికి వేదికగా యువజనోత్సవాలు నిలుస్తాయని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ అన్నారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగే ఉద్భవ్ - 2025 యువజనోత్సవాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణనాయక్ మాట్లాడుతూ యువజనోత్సవాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చూపాలన్నారు. ఆర్‌జేడీ శోభారాణి మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేలా యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆహారపదార్థాలు, వస్తువుల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్భవ్ కమిటీ కో ఆర్డినేటర్ మల్లికార్జున, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు రఘుదేవపురం,రాపాకల్లో విద్యుత్‌కు అంతరాయం

సీతానగరం, ఫిబ్రవరి 20 : సీతానగరం మండలం రఘుదేవపురం , రాపాక గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. సీతానగరం హెడ్ క్వార్టర్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అసౌకర్యాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

వైభవంగా సత్తెమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

అనపర్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో సబ్బెళ్ళ వారి సత్తెమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సబ్బెళ్ళ వంశీయులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11కేవీ యూనివర్సిటీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం నేటి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలచర్ల గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.





చదివి..ఎదిగారు.. వీసీగా వచ్చారు!

నన్నయ వీసీగా సత్తుపాటి ప్రసన్నశ్రీ

విద్యార్థులకు ఆమె ఆదర్శం.. ఎలా చదవాలి.. ఎలా ఎదగాలి అనే దానికి ఆమె ఒక నిదర్శనం.. ఎందుకంటే ఎక్కడో గుంటూరు జిల్లా స్టూవర్టుపురం ఆమె స్వగ్రామం.. ఆ పేరు వింటే అందరికీ గుర్తొచ్చేది ఒక్కటే.. కానీ అక్కడ నుంచి ఎదిగారు.. కష్టపడి చదివారు.. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 23 భాషలు మాట్లాడతారు.. 17 గిరిజన భాషలకు లిపిని తయారుచేసి తానేంటో నిరూపించారు.. కూటమి ప్రభుత్వం పట్టం కట్టడంతో తూర్పుగోదావరి జిల్లాలోని నన్నయ వర్శిటీ ఉపకులపతిగా ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు.. ఆమెను ఆంధ్రజ్యోతి పలకరించగా నేను రాజమహేంద్రవరం కోడలినే అంటూ పలు విషయాలు చెప్పకొచ్చారు..

6


సిల్వర్..మెరుపులు!



బంగారమే కాదండోయ్.. సిల్వర్ ధగధగ లాడుతోంది.. తగ్గుతూ పెరుగుతూ రూ.లక్షకు చేరింది.. గత వారం రోజులుగా రూ.99,500లకు చేరువై రూ.లక్ష దోబూచులాడుతోంది.. బుధవారం రూ.99,800లు పలికింది.. గురువారం రూ.లక్షకు చేరువైంది.

8

మన ప్రకృతి సాగుపై జర్మన్ బృందం ఆసక్తి



మన ప్రకృతి సాగును పరిశీలించేందుకు జర్మన్ బృందం వచ్చింది.. దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో రైతులతో మాట్లాడి ప్రకృతి సాగుపై అవగాహన పెంచుకుంది.. ఎలా సాగు చేయాలో పరిశీలించింది.

8

సమస్య ఉంటే వాట్సప్ మెసేజ్ చేయండి

- నెంబరు 9552300009

- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు తమ వద్ద ఉన్న సమాచారాన్ని వాట్సప్ నంబర్ 9552300009 ద్వారా వేగంగా చేరవేయవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పౌర సేవలతో పాటు ప్రజలకు సమాచారం చేరవేయడానికి కూడా వాట్సప్ గవర్నెస్ ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ పథకాల సమాచారం కూడా ఈ వాట్సప్ ద్వారా ప్రజలకు చేరవేయవచ్చన్నారు. జిల్లా యంత్రాంగానికి ప్రజలు ఏదైనా ఫిర్యాదు చేయాలనుకుంటే ఈ వాట్సప్ నెంబర్‌కు మెసేజ్ చేస్తే సరిపోతుందన్నారు. వాట్సాప్ ఫిర్యాదుల గణాంకాలు, వాటి పరిష్కారం వివరాలపై డివిజనల్ అభివృద్ధి అధికారులు నివేదిక అందజేయాలన్నారు.

రీసర్వే సక్రమంగా జరగాలి : కలెక్టర్



దొంతమూరులో రీసర్వే చేసిన భూముల వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రంగంపేట,ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భూ రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు ఆదేశించారు.భూముల సమగ్ర రీ సర్వే ప్రక్రియలో భాగంగా గురువారం రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామంలో రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే జరిగే సమయంలో భూ యజమానులను భాగస్వామ్యం చేయాలన్నారు.సరిహద్దుదారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే చేసిన వాటిపై భూ యజమానులకు ఏదైనా అభ్యంతరం ఉంటే సర్వే తిరిగి చేయాలన్నారు. ఉద్దేశపూర్వకంగా రికార్డులను టాంపరింగ్ చేసినా, తప్పుగా నమోదు చేసినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ పర్యటనలో జిల్లా అధికారి బి.లక్ష్మీ నారాయణ, తహశీల్దార్ కోసు అనసూయ, మండల సర్వేయర్ కె.కుమారి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ హేమసుందర్, ఆర్ఐ గోపి, సర్వేయర్లు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో మెరుగైన పౌర సేవలు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): క్యూఆర్ కోడ్‌తో మరింత మెరుగైన పౌర సేవలందించడానికి చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఏపీ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రూప్-2, ఇంటర్మీడియట్ పరీక్షలు,పీ4 మోడల్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు.ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 8 నుంచి 18 వరకూ పీ4 సర్వే, గ్రామ సభలు 20 నుంచి 24 వరకూ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

1 నుంచి ఇంటర్ పరీక్షలు

మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 51 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి ఏడాది 20591, రెండో ఏడాది 19062, ఒకేషనల్ మొదటి ఏడాది 2226, రెండో ఏడాది 1875 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. పరీక్షలు జరుగుతున్న రోజుల్లో ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబరు 0883-2473430 అందుబాటులో ఉంటుందన్నారు. రాజమహేంద్రవరంలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని, ఐదు సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్న రాముడు,ఎస్పీ నరసింహ కిశోర్, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీకృష్ణ, డీఆర్వో సీతారామమూర్తి,సీపీవో అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.



సైకిల్‌కు సవాల్

కూటమి పక్షాన భారీగా మోహరింపు

- ఎమ్మెల్సీ ఎన్నికపై తీవ్ర ఉత్కంఠ
- రంగంలోకి మంత్రులు, ఎమ్మెల్యేలు
- ఆశించిన మెజార్టీకి పట్టు
- బరిలో 35 మంది అభ్యర్థులు
- మొత్తం ఓటర్లు 3.15 లక్షలు
- చెల్లని ఓట్ల తగ్గింపుపై వ్యూహం
- పట్టభద్రుల చుట్టూ ప్రచారం

(ఏలూరు/కాకినాడ, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీలో ఉన్న అభ్యర్థులంతా ప్రచారానికి మరింత పదునుపెట్టారు. క్షేత్ర స్థాయిలో గట్టి నాయకత్వ పట్టున్న టీడీపీ ఎట్టి పరిస్థితుల్లోను ఈ స్థానం నుంచి తమ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలిచి తీరాలనే పట్టుదలతో ఉంది. సీఎం చంద్రబాబు నుంచి ముఖ్యనేత లంతా ఎప్పటికప్పుడు నియోజకవర్గాల వారీగా సమాచారాన్ని రాబట్టడమే కాకుండా అప్పటి కప్పుడే సమీక్షిస్తున్నారు. ప్రచారంలో ఎక్కడ వెనుకబడ్డారు? ఎక్కడ దూసుకెళ్తున్నారనే విషయాన్ని రాబడుతూనే వచ్చారు.పట్టభద్రులైన ఓటర్లంతా తరలివచ్చేలా చేయడం అంత సులువు కాదని భావించి యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశారు. గత అనుభవాలను దృష్ట్యా సాధారణ ఎన్నికల కంటే మించి ఎమ్మెల్సీ అభ్యర్థికి అత్యధిక ఓట్లు రావా లన్న షరతు విధించారు.దీంతో ఇప్పుడు కూటమిలో ఉన్న ఎమ్మెల్యేలు,మంత్రులతో పాటు మిగతా వారందరికీ ఈ ఎన్నిక ఒక సవాల్‌గానే మారింది.పట్టభద్రుల ఓటర్లు అత్యధికంగా ఉన్న మండల కేంద్రాలు,పట్టణాలు, కార్పొరేషన్లలో ప్రచారాన్ని మోహరించారు.

బరిలో 35 మంది..

ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. వీరిలో అత్యధికులు ప్రచారంలోను శరవేగంగా ముందుకు సాగుతూనే ఉన్నారు. యువతకు మేలు జరగాలంటే తాము విధాన పరిషత్‌లో అడుగు పెట్టేలా చూడాలని ఓటర్లను అభ్యర్థిస్తూ వస్తున్నారు. తెలుగుదేశం పక్షాన పేరాబత్తుల రాజశేఖరం అభ్యర్థిగా ఉన్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, వివిధ విభాగాల కార్పొరేషన్ల చైర్మన్‌లు, సభ్యులతోపాటు స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రచారంలో ఒక ఊపు తెస్తున్నారు. ఏ నియోజకవర్గంలో ఎంతెంతమంది ఓటర్లు ఉన్నది ఇప్పటికే గుర్తించినందున దీని ఆధారంగా చేసుకుని ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమ గోదావరికి చెందిన ఇన్‌చార్జి మంత్రులు గొట్టిపాటి, నాదెండ్లతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఇన్‌చార్జి మంత్రులు నారాయణ,అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు కూటమి నేతలను ఏకం చేసి ఏ రోజుకారోజు నియోజకవర్గాల్లో ఉన్న స్థితిగతులను ఆరా తీస్తున్నారు. వీరితో పాటు మంత్రులు కందుల దుర్గేష్,సుభాష్ కూడా ఆయా నియోజకవర్గాల్లో కూటమి శ్రేణులను సమన్వయం చేస్తున్నారు. జనసేన పక్షాన ఎమ్మెల్యేలుగా ఉన్న పోలవరం, ఉంగుటూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, నిడదవోలుతో పాటు రాజానగరం, పిఠాపురం, రాజోలు, పి.గన్నవరం, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఓటర్ల నాడి ఎలా ఉందో జనసేన ఆ పార్టీ ఆరా తీస్తోంది. బీజేపీ మాత్రం ఈ విషయంలో పెద్దగా చొరవ తీసుకున్న పరిస్థితి కనిపించడంలేదు. తెలుగుదేశం, జన సేన నేతలంతా ఉమ్మడిగా నియోజకవర్గాల్లో కలియ తిరుగుతుండగా,కమలనాథులు మాత్రం తమకు ప్రత్యేకించి ఆహ్వానం లేదన్నట్టుగా మిన్నకుండిపోతున్నారు.మండల స్థాయిలోను ఇదే ధోరణిలో అన్ని పార్టీలు ఉన్నాయి. తెలుగు దేశం మాత్రం అభ్యర్థి రాజశేఖరం గెలుపును భుజానకెత్తుకుని విరామం లేకుండా ప్రచారం కొనసాగిస్తోంది.

చెల్లని ఓట్లే అత్యంత కీలకం

గడిచిన పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో భారీగా చెల్లని ఓట్లు నమోదయ్యాయి. అప్పట్లో రెండు లక్షల 20 వేలకుపైగా ఓట్లు ఉండగా లక్షా 92 వేల 24 ఓట్లు పోలయ్యాయి. దాదాపు 13 వేల 852 ఓట్లు చెల్లకుండా పోవడంతో అందరూ ముక్కున వేలేసుకున్నారు. పీడీఎఫ్ బలపరిచిన యిళ్ల వెంకటేశ్వరరావుకు 98 వేల 193 ఓట్లు లభించగా ఆయన సమీప ప్రత్యర్థి నల్లమిల్లి శేషారెడ్డికి 38 వేల 124 ఓట్లు లభించాయి. ఇప్పుడు జరగబోతున్న ఎన్నికల్లో టీడీపీ పక్షాన రాజశేఖరం ఉండగా పీడీఎఫ్ తరపున దిడ్ల వీరరాఘవులు పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య నువ్వా నేనా అన్నంతగా కూటమి పక్షాన వామపక్షాల తరపున హోరాహోరీగా ప్రచారం సాగుతోంది. వచ్చిన చిక్కల్లా ఏంటంటే ఈ సారి గతంకంటే లక్ష ఓట్లు అదనంగా మూడు లక్షల 15 వేలకుపైగా ఓటర్లు ఉన్నారు. ఇప్పుడు ఎటు తిరిగి సాధ్యమైనంత మేర చెల్లని ఓట్లు తగ్గించుకోవడం, ఆ మేరకు మెజార్టీ స్థానంలో వచ్చేలా చూడడం కూటమి పక్షాన నేతలందరికీ పెద్ద అగ్ని పరీక్షగానే మారింది. అందుకనే ప్రాధాన్యత ఓటు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఓటర్లందరికీ విడమరిచి మరీ చెబుతున్నారు. ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్నుతోనే బ్యాలెట్ పేపర్‌పై ఒకటవ ప్రాధాన్యత ఓటును ఒకటవ సంఖ్యగా వేయాల్సిందిగా పదేపదే చెబుతూ వస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇన్ టూ మార్క్ పెట్టవద్దని అభ్యర్థిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మిగతా ఇండిపెండెంట్ సభ్యులు భారీగానే ఉన్నందున వీరంతా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రచారం ఉధృత స్థాయికి తీసుకువెళ్తున్నారు. గత ఎన్నికల్లో 43 మంది పోటీ పడగా 12 మంది అభ్యర్థులు మాత్రమే వెయ్యి సంఖ్యను దాటి ఓట్లు దక్కించుకోగలిగారు. ఈసారి టీడీపీకి పూర్తి అనుకూలత దక్కేలా కూటమి నేతలు మోహరించడంతో ఆ మేరకు మిగతా ఇండిపెండెంట్‌లకు వచ్చే ఓట్ల సంఖ్యలో చీలిక ఏర్పడే అవకాశం కనపడుతుంది.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు చిత్రంలో ఎమ్మెల్యేలు, నాయకులు

గెలుపు రాజశేఖరందే

మంత్రి నిమ్మల రామానాయుడు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని జిల్లా ఇన్‌చార్జి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎంత మంది అభ్యర్థులు ఉన్నా తమదే గెలుపు అన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి,రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, అనుశ్రీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆనందం వరించెన్!

అప్పుడు ఏడిపించెన్...ఇప్పుడు ఠంఛన్

- తీరిన అన్నదాతల కష్టాలు
- చకచకా ఖరీఫ్ ధాన్యం సేకరణ
- 5 లక్షల మెట్రిక్ టన్నులు
- ఖాతాల్లోకి రూ.910 కోట్లుపైనే
- ఠంఛనుగా చెల్లింపులు
- ఉమ్మడి జిల్లాలో ఆనందం
- గత వైసీపీలో రైతులకు చుక్కలు
- నెలల తరబడి వేధింపులు
- నాడు ఏప్రిల్ దాటినా అరకొరే
- బాకీలు అడిగితే అరెస్టులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఎన్నాళ్లకెన్నాళ్లకు..అన్నదాతలకు ఆనందం వరించెన్..బకాయిలకు ఎదురు చూపుల్లేవు.. కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరగడం లేదు.. ఖాతాలో డబ్బులు పడ్డాయో లేదో నెలలతరబడీ బ్యాంకుల వద్ద పడిగాపులు లేవు..ధాన్యం ఇచ్చిన కొన్నిరోజులకే ఏ మాత్రం ఆలస్యం లేకుండా నేరుగా ఖాతాల్లోకి డబ్బులు.. ఇదీ కూటమి ప్రభుత్వం రాకతో జిల్లాలో మారిన అన్నదాతల పరిస్థితులు..జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం సేకరణ ఎట్టకేలకు పూర్తికాగా ఇప్పటి వరకు సేకరించిన సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నులకు అన్నదాతల ఖాతాల్లోకి ఏకంగా రూ.910 కోట్లకుపైగా కూటమి ప్రభుత్వం చెల్లించింది. ఐదేళ్ల తర్వాత తొలిసారి ధాన్యం బకాయిలకు అన్నదాతలు రోడ్డెక్కే పరిస్థితి లేకుండా ఠంఛనుగా చెల్లింపులు జరిగాయి.గత వైసీపీ ప్రభుత్వంలో ఏటా అన్నదాతలకు నరకయాతనే.

గత ఐదేళ్లూ నరకమే..

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు అన్నదాతలకు ధాన్యం డబ్బుల కష్టాలు పెరిగాయి. ధాన్యం డబ్బులు 21 రోజుల్లో చెల్లిస్తా మంటూ అప్పట్లో సీఎం జగన్ వరుసగా ఐదేళ్ల పాటు గొప్పలు చెప్పారు. కానీ ఆచరణలో ఏ యేడు దీన్ని నిలబెట్టుకోలేదు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో అన్నదాతల నుంచి ధాన్యం సేక రించడం, బాకీలు నెలలు గడుస్తున్నా ఇవ్వ కుండా వేధించడం పరిపాటి.ఎవరైనా రైతులు బాకీలకు రోడ్డెక్కితే అరెస్టులు చేయించింది. చివరకు బాకీ వివరాలు సైతం బయటకు పొక్క నీయొద్దని జిల్లా జేసీలు, పౌరసరఫరాల సంస్థను ఆదేశించి గుట్టు పాటించింది. వాస్తవానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 10.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అన్నదాతలు డబ్బులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టేది. లక్ష్యం కంటే తక్కువగా సేకరించిన ధాన్యానికి రూ.1,143 కోట్ల వరకు చెల్లించాల్సి వచ్చేది. కానీ ప్రభుత్వం మాత్రం ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరించిన తర్వాత మార్చి,ఏప్రిల్ దాటినా సరే చెల్లించాల్సిన బాకీల్లో సగం కూడా అన్నదాతల ఖాతాల్లోకి జమచేసేది కాదు. అటు రబీలోను ఇదే తంతు. రూ.700 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉంటే వాటినీ ఇచ్చేది కాదు. ఐదేళ్ల పాటు అన్నదాతలను అప్పటి వైసీపీ ప్రభుత్వం దారుణంగా వేధించింది. అనేక సార్లు కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అన్నదాతలు బాకీల కోసం రోడ్డెక్కారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి సమీపంలో ఓ మండలంలో ధాన్యం బాకీ కోసం ఓ రైతు ఏకంగా ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి. ఇలా గత వైసీపీ పాలనలో అనేక మంది అన్నదాతలు నరక యాతన పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. కూటమి ప్రభుత్వంలో తొలిసారీ ఖరీఫ్ ధాన్యం సేకరణ కావడంతో ప్రభుత్వం ఎక్కడికక్కడ జాగ్రత్తలు తీసుకుంది.ఏ రైతుకు ఇబ్బంది లేకుండా అధికారులను అప్రమత్తం చేసింది.

ఠంఛనుగా ఖాతాల్లోకి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన తొలి ఖరీఫ్ ధాన్యం సేకరణ నేపథ్యంలో చెల్లింపులను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎక్కడా లోటు పాట్లు లేకుండా ఠంఛనుగా చెల్లింపులు చేసింది.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 4.50 లక్షల మెట్రిక్ టన్నులకు రైతుల ఖాతాల్లోకి రూ.910 కోట్లుపైనే జమచేసింది. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 1.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. అత్యధికంగా సామర్లకోట మండలంలో 35,723 మెట్రిక్ టన్నులు, కరప 19,838, పెదపూడి 19,450, కాజులూరు 17,026, జగ్గంపేట 11,792, పెద్దాపురం 8,042, కోటనందూరు మండలంలో 7,780 మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం సేక రించింది. ఎక్కడా ధాన్యం తీసుకోవడం లేదనే ఫిర్యాదు లేకుండా అన్నదాతలందరి వద్ద గింజలు సేకరించింది. జిల్లా వ్యాప్తంగా రూ.356 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించి 102 మిల్లులకు అప్పగించింది.ఇందులో ఇప్పటి వరకు మొత్తం రూ.355.01 కోట్లు చెల్లించేసింది. మిగిలిన చిన్న మొత్తాలకు ఎఫ్‌టీవోలు తయారుచేసి చెల్లింపులకు పంపింది.ఇలా ఎక్కడా జాప్యం లేకుండా పక్కాగా సకాలంలో చెల్లింపులు జరిపింది. ఇలా 26,415 మంది అన్నదాతల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిం చింది. ఇందుకు రూ.523 కోట్లు చెల్లించాల్సి ఉం డగా ఇప్పటి వరకు రూ.522.71 కోట్లు చెల్లిం చింది. మొత్తం 39,180 మంది అన్నదాతల ఖాతాల్లోకి జాప్యం లేకుండా చెల్లింపులు జరి పింది.అత్యధికంగా రామచంద్రపురం మండ లంలో 28,357 మెట్రిక్ టన్నులు, పామర్రు 27,311, కపిలేశ్వరపురం 24,183, మండపేట మండలంలో 18వేలకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. తూర్పుగోదావరి జిల్లాలో రూ.200 కోట్లకు పైగానే చెల్లింపులు చేసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఏరైతును ఇబ్బంది పెట్టకుండా దాదాపు 90 వేల మందికిపైగా రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమచేసింది. దీంతో రైతులు ఆనందోత్సవాలు చేసుకుంటున్నారు. గడచిన ఐదేళ్లలో ఏనాడు డబ్బులు ఇలా సకాలంలో రాని పరిస్థితులు కళ్లారా చూసిన అన్నదాతలు కూటమి ప్రభుత్వం రాకతో ఆనాటి చీకటి రోజులు తొలగి ఎప్పటి బాకీలు అప్పుడు జమ అవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రిలో బీ..అలర్ట్ !

- పలువురు డాక్టర్లకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు ?
- వైద్యుల పనితీరు మోనిటరింగ్ చేస్తున్న జిల్లా అధికారులు
- హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీని హెచ్చరిస్తూ సూపరింటెండెంట్ సర్క్యులర్



ఎంఎన్‌వోలను హెచ్చరిస్తున్న సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీటీజీహెచ్) లో పనిచేస్తున్న వైద్యులు, ఫ్యాకల్టీ పనితీరుపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించే విషయంలో కొందరు వైద్యులు, ఫ్యాకల్టీ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సీరియస్‌గా భావిస్తున్నట్టు తెలుస్తోంది. వైద్యులు అందుబాటులో ఉండడంలేదని, రెగ్యులర్ ఓపీ సమయాల్లోనూ విధులకు గైర్హాజరవుతున్నారని రోగులు, వారి బంధువులు, ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఇటీవల జిల్లా కలెక్టర్ నెల రోజుల వ్యవధిలోనే రెండుసార్లు ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీలు చేసి వైద్యుల గైర్హాజరును గుర్తించారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ హాజరుపట్టీతో పాటు కొన్ని రికార్డులు వెంట తీసుకెళ్లి పరిశీలించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట పలువురు వైద్యులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరినట్టు తెలిసింది. దీంతో ఆసుపత్రి అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ అందరు హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీకి బీ..అలర్ట్ అంటూ ఒక సర్క్యులర్ పంపించారు. హెచ్‌వో డీలు, ఫ్యాకల్టీ అందరూ డ్యూటీల విషయంలో నిర్లక్ష్యంగా ఉండరాదని, డ్యూటీ టైమింగ్స్ సక్రమంగా పాటించాలని, ఓపీ వేళల్లో ఫ్యాకల్టీ అందరూ ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని, సెలవులు పెట్టడానికి సరైన కారణాలు చూపాలని స్పష్టం చేశారు. ఈ సర్క్యులర్ ఆసుపత్రి హెచ్‌వోడీలతో పాటు ఫ్యాకల్టీలోనూ చర్చనీయాంశంగా మారి గుబులురేపుతోంది.

లంచం తీసుకున్నట్టు ఫిర్యాదులు వస్తే ఇంటికే

ఎంఎన్‌వోలకు హెచ్చరిక

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వైద్యసేవల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల నుంచి లంచం డిమాండ్ చేసి డబ్బులు తీసుకున్నట్టు ఫిర్యాదు వస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ హెచ్చరించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ ఎంఎన్‌వోల సూపర్‌వైజర్‌తో పాటు, ఇతర ఎంఎన్‌వోలను తన ఛాంబర్‌కు పిలిచి మాట్లాడారు. రోగులను స్ట్రెచర్, వీల్‌చైర్‌లో తీసుకెళ్లడానికి, వార్డులో అడ్మిట్ చేయడానికి, ఎక్స్‌రే, ఎంఆర్ఐ తదితర స్కానింగ్‌ల కోసం తీసుకెళ్లడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు తనకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు.పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవన్నారు. డ్యూటీ సమయంలో విధులను సక్రమంగా నిర్వర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వైద్యసేవలకు రోగుల సహాయకులను డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వివిధ వర్గాల సమాచారంతోనే సూపరింటెండెంట్ తీవ్రంగా పరిగణించి ఎంఎన్‌వోలను హెచ్చరించినట్టు ప్రచారం జరుగుతోంది.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

' హింసతో న్యాయం జరగదు '


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి

కొవ్వూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : హింసతో న్యాయం జరగదని కొవ్వూరు సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి అభిప్రాయపడ్డారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. సామాజిక న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆమె మాట్లాడుతూ న్యాయం అందరికీ సమానంగా అందినప్పుడే న్యాయవ్యవస్థపై నమ్మకం పెరుగుతుందన్నారు. అంగన్వాడీవర్కర్లు, సిబ్బందికి మూడు రోజులుగా సీనియర్ సివిల్ జడ్జి యోగా, ధ్యానంపై శిక్షణ అందజేశారు. అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో న్యాయవాదుల నిరసన


పట్టణంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నిడదవోలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల వృత్తికి సంకెళ్లు వేసే న్యాయవాదుల బిల్లు- 2025ను ఉపసంహ రించుకోవాలని అఖిల భారత ప్రగతిశీల న్యాయవాదుల సంఘం నేషనల్ కన్వీనర్ నంబూరి శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నిడదవోలు పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బయట అఖిల భారత ప్రగతిశీల న్యాయ వాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదుల నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు న్యాయవాదుల వృత్తికి భద్రత కల్పించాలని కోరారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మత్తి అర్జునుడు, సీహెచ్ విజయ్ కుమార్, నక్కా వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవా దులు పంతకాని సురేష్‌బాబు, చాపల సుబ్బారావు, పీ.సుబ్ర హ్మణ్యం, పేరూరి సాయిబాబా, జమీలా, తదితరులు పాల్గొన్నారు.

కానూరు పాఠశాలకు ఫర్నిచర్ వితరణ



ఫర్నిచర్ బహూకరిస్తున్న బ్యాంకు సిబ్బంది

ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 20 (ఉండ్రాజవరం): పెరవలి మండలం కానూ రు నెం.3 పాఠశాలకు ఉండ్రాజవరం మండలం పాలంగి ఐడీబీఐ బ్యాంకు రూ.55 వేలు విలువైన కంప్యూటర్, ఫర్నిచర్, ఆర్వో వాటర్ కూలర్‌ను గురువారం అందజేసింది. బ్యాంకు సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా వీటిని ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు షేక్ మస్తాన్ బ్యాంకు సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఐడీబీఐ బ్రాంచి మేనేజర్లు ఎన్. కార్తీక్, సీహెచ్ రమేష్, అసిస్టెంట్ మేనేజర్లు కె. అశోక్, కె. కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కే.సావరంలో వైద్యబృందం సందర్శన


రికార్డులను పరిశీలిస్తున్న వైద్య బృందం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 20 (ఉండ్రాజవరం): కే. సావరంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా జిల్లా వెరిఫికేషన్ టీమ్ గురువారం సందర్శించింది. జిల్లా అద నపు వైద్యాధికారి, జిల్లా క్షయ, ఎయిడ్స్ లెప్రసీ వైద్యాధికారి డాక్టర్ వసుంధర, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం డాక్టర్ సురేంద్ర రికార్డులను పరిశీలించారు. 2024 సంవత్సరములో నమోదైన టీబీ నిర్ధారణ పరీక్షలు, నమోదు చేయబడిన టీబీ రోగుల వివరాలు, నిక్షయ్ పోషణ యోజన, పోషకాహార కిట్ల వివరాలు పరిశీలించి, నమోదు చేసుకున్నారు. గ్రామసర్పంచ్ నార్ని రామకృష్ణ, పీహెచ్‌సీ డాక్టర్ ఆర్. ఉషాదేవి, పంచాయతీ కార్యదర్శి పీ. సత్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చిడిపిలో వైద్యశిబిరం

కొవ్వూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చిడిపి ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు వచ్చి 65 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 11 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పందులు స్వైరవిహారం

• భయపడుతున్న స్థానికులు
• పట్టించుకోని మున్సిపల్ అధికారులు


లాయర్స్‌కాలనీలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు



కొవ్వూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లాయర్స్‌కాలనీలోని ఖాళీస్థలాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఒకపక్క స్వచ్ఛాంధ్ర అంటూ మున్సిపల్ అధికారులు ర్యాలీలు నిర్వహిస్తున్నా ... క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. దీంతో పాటు పలు వార్డులలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి ఉండడంతో మురుగు నిల్వలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆ ఖాళీస్థలాలు పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. మరి కొన్నిప్రాంతాల్లో అయితే ఇళ్లల్లోకి చొరపడుతుండంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పిల్లలు ఇంటి నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. వీటికితోడు వీధికుక్కలు, దోమలు కూడా విపరీతంగా ఉన్నాయి. ఇకనైనా అధికారులు వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, తదితరులు కోరుతున్నారు.

రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

• ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థించిన ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు


కొవ్వూరు నారాయణ పాఠశాలలో ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టభద్రులంతా కూటమి ప్రభుత్వం బలపర్చిన పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం కొవ్వూరు పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. డీఏవీ, భాష్యం, నారాయణ స్కూళ్లు, డీఎల్‌పీవో కార్యాలయం, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ కార్యాలయాలు, పశువేదల, నందమూరులోని ఉద్యోగులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, కే. బాలాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కూటమి నాయకులు అడ్డూరి సత్యనారాయణ, మాట్ల ఆంజనేయులు, ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గోపాలపురం: కూటమి ప్రభుత్వం బలపర్చిన పేరాబత్తుల రాజశేఖర్‌కు పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కోరారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పట్టభద్రులతో గురువారం ఆయన మాట్లాడారు. రాజం పాలెం, హుకుంపేటలోని పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, ఎన్నికల పరిశీలకుడు రంగనాయకులు, టీడీపీ సీనియర్ నాయకులు కొర్లపాటి రాము, హోతా రాజాబాబు, వడ్లమూడి రమేష్, జ్యేష్ఠ శ్రీధర్, జ్యేష్ఠ శ్రీనివాసరావు, యండ్రప్రగడ మంగారావు, విష్ణురాజు, కాట్రగడ్డ సురేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. చిన్నాయిగూడెంలో గురువారం సాయంత్రం నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నిక ఉన్నందున కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల్లో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. స్వర్ణాంధ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు అంద్రూ అనీల్, ఏఎంసీ మాజీ చైర్మన్ గడా మురళీ అజిత్‌కుమార్, టీడీపీ నాయకులు ఉప్పులూరి రాంబాబు, బళ్లా సూర్యచక్రం, పిన్నమనేని సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురం హైస్కూల్‌లో పట్టభద్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

న్యాయవాది కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే


సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, కూటమి నాయకులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పెద్దేవం గ్రామానికి చెందిన న్యాయవాది తిగిరిపల్లి సుబ్బారావు ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బారాయచౌదరి, సూరపనేని చిన్ని, మద్దిపట్ల శివ రామకృష్ణ, కోడి శంకరం, తిగిరిపల్లి గోపి, కూటమినాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ పరీక్షలు చేయించుకోవాలి

• జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ అధికారి వసుంధర


నెలటూరులో మాట్లాడుతున్న అధికారి వసుంధర, తదితరులు

చాగల్లు, ఫిబ్రవరి 20, (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నిర్ధారణకు అందరూ కఫం పరీక్షలు చేయించుకోవాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ అధికారి వసుంధర అన్నారు. గురువారం నెలటూరు ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ సకాలంలో సరైన వైద్యం చేయించుకుంటే ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈమెతోపాటు డాక్టర్ తనూజ, ఐఎంఏ టీం, టీబీ సూపర్‌వైజర్ పోతురాజు, తదితరులు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి


గోపాలపురంలో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్వో భాగ్యవతి

గోపాలపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని గోపాలపురం నియోజకవర్గ ఎన్నికల ఆర్వో భాగ్యవతి అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఉన్న 59వ పోలింగ్‌బూత్‌ను ఆమె గురువారం పరిశీలించారు. మండల పరిధిలో 1779 మంది ఓటర్లకు ఓటర్ స్లిప్‌లనుఅందించారన్నారు. డీటీ లక్ష్మీదేవి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ నల్లరాజు, వీఆర్వోలు లక్ష్మి, శ్రీను,బీఎల్‌వో బాలకుమారిపాల్గొన్నారు.

కూటమిలో ఐక్యత లోపించింది

• మాజీ ఎంపీ హర్షకుమార్


ప్రచారంలో పాల్గొన్న జీవీ హర్షకుమార్

నిడదవోలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమిలో కొంత వరకు ఐక్యత లోపించినట్టు అనిపిస్తోందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. గురువారం పురుషోత్తపల్లిలో తన కుమారుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్ ప్రచారాన్ని నిర్వహించారు. అలాగే గోపాలపురం, కొవ్వూరులో విలేఖరులతో మాట్లాడారు. ఈయనతో పాటు మాజీ ఎంపీటీసీ పైడి దొరబాబు, జీవీ శ్రీరాజ్, వరిగేటి కిరణ్, యర్రా రామకృష్ణ, దాసరి కుటుంబరావు, రాజశేఖర్, రవీంద్ర, జీ.వీ శ్రీరాజ్, సాకా పుల్లారావు, చొప్పా అప్పల నాయుడు, మాసా ఆనంద్, దారం గిరి, చిన్నం హరిబాబు , తదితరులు ఉన్నారు.

26న పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం

కొవ్వూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సారా కేసులలో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ జీ. సత్యనారాయణ తెలిపారు. ఈనెల 26వ తేదీన స్టేషన్ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ. 5వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. పాటలో వాహనాలను దక్కించుకున్న వారు వేలం సొమ్ము, 18 శాతం జీఎస్టీకి సంబంధించి రెండు చలానాలను ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జీఎస్టీ నెంబరుకు జమ చేయాలన్నారు. వివరాలకు 9440942430 ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

షేక్ హుస్సేన్ మృతి తీరనిది



నిడదవోలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేత షేక్ హుస్సేన్ జహా (65) ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నేతలు కొనియాడారు. గురువారం ఆయన మృతదే హానికి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ హుస్సేన్‌జహా మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా ఎనలేని సేవలు అందించారన్నారు. పార్టీపట్ల నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని అన్నారు. అనంతరం ఆయన మృతదేహానికి పార్టీ కండువా కప్పి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మేడవరపు భద్రందొర, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీ కృష్ణ, అగర్వాల హీరాలాల్, జీవివి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

భార్య, మామపై కత్తితో దాడి

• అక్కడికక్కడే భార్య మృతి, మామకు తీవ్ర గాయాలు • కుటుంబ కలహాలే కారణం


రక్తపు మడుగులో పడివున్న కృష్ణతులసి మృతదేహం

కొవ్వూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్యను, మామను కత్తితో దాడిచేసిన సంఘటన వాడపల్లి బంగారమ్మపేటలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే వాడపల్లి బంగారమ్మపేటకు చెందిన అడ్డాల నాగయ్యకు నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు కుమారులు ఉన్నా రు. వారిలో పెద్ద కుమార్తె, కుమారుడు అనారోగ్యంతో మృతిచెందగా, మిగతా ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. ఇందులో మూడో కుమార్తె గంధ్ర కృష్ణతులసి (37)కు కృష్ణా జిల్లా తిరువూరు సమీపంలోని రాజుగూడెంకి చెందిన గంధ్ర మురళీకృష్ణ చౌదరితో 16 సంవత్సరాల క్రితం రెండో వివాహం జరిగింది. అయితే మురళీకృష్ణ, కృష్ణతులసి కొంతకాలం సఖ్యంగానే ఉన్నారు. అనంతరం గొడవలు జరగ్గా కృష్ణతులసి పుట్టింటికి వచ్చేసింది. గత నాలుగు నెలలుగా భార్యాభర్తలు విడివిడిగా ఉంటున్నారు. మురళీకృష్ణ బంగారంపేట గోదావరి ఏటిగట్టుపై వద్ద గల బస్‌షెల్టర్ పక్కన కొబ్బరి బొండాల షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో తండ్రి నాగయ్యతో కలిసి కృష్ణతులసి గోదావరి ఏటిగట్టు కింద కట్టిన గేదెల వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా, కొబ్బరి బొండాల షాపు వద్ద ఉన్న భర్త మురళీకృష్ణను చూసి తన తండ్రి వద్ద గతంలో అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వాలని కోరింది. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన మురళీకృష్ణ తన చేతిలో ఉన్న కొబ్బరి బొండాల కత్తితో దాడి చేయగా కృష్ణతులసి అక్కడికక్కడే మృతిచెందింది. ఆ తర్వాత వచ్చిన మామ నాగయ్యనూ మెడపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు కొవ్వూరు డీఎస్పీ జీ. దేవకుమార్, పట్టణ ఎస్ఐ కె. జగన్మోహనరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన నాగయ్యను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చేర్పించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణతులసికి మొదటి భర్తకు ఒక కుమారుడు ఉన్నాడు. పని నిమిత్తం భీమవరం వెళ్లాడు. మృతురాలి సోదరుడు అడ్డాల సూర్యభాస్కర్ అందించిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన అడ్డాల నాగయ్య

దేవరపల్లిలో జర్మన్ ప్రతినిధుల బృందం


పల్లంట్లలో ఆకుకూరలు సాగు చేస్తున్న సత్యవర్తినిని వివరాలు అడుగుతున్న బృంద సభ్యులు

దేవరపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో జర్మన్ ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. దేవరపల్లి మండలంలోని పల్లంట్ల, యర్నగూడెం, కురుకూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పండించే పంటల గురించి ఆ బృందం సభ్యులు రైతులను అడిగి తెలుసు కున్నారు. నలుగురు సభ్యులతో కూడిన ఈ బృందంలో ఫౌండేషన్ ఆన్‌ఫ్యూచర్ ఫార్మింగ్ తరఫున జాస్పర్ జోర్డాన్, బెనెడిక్ట్ హెర్లిన్, పోర్చుగల్‌కు చెందిన ప్రాజెక్టు ఎర్త్ ప్రతినిధి డియోగో కౌటినో, అటెలియర్‌ఫుడ్ సిస్టమ్ చేంజ్ ప్రతినిధి లూకాస్ కేప్లే ఉన్నారు. దీనిలో భాగంగా యర్న గూడెంలో రైతు గద్దే మునేశ్వరరావు తన తొమ్మిది ఎకరాల్లో పప్పుధాన్యాలు, 35 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్న పొలాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పాటించడానికి మీ లక్ష్యమేమిటని అడిగారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు భూసారాన్ని పెంపొందిం చుకోవచ్చని, అలాగే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని రైతు మునేశ్వర రావు జర్మన్ బృందానికి తెలిపారు. తమ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటకు స్వయంగా ప్రకృతి సాగు పదార్థాలైన ద్రవ జీవామృతం తయారు చేసుకోవడం, డ్రోన్ పిచికారీ సాంకేతికత జర్మన్ బృందాన్ని ఆకట్టుకుంది. పల్లంట్లలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కౌలురైతు సీహెచ్. సత్యవతి ఎకరం భూమిని కౌలుకు తీసుకుని అన్నిరకాల ఆకుకూరలు, ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తూ అధిక లాభా లు సాధిస్తున్న అంశాన్ని జర్మన్ బృందాన్ని ఆకట్టుకుంది. వీరితోపాటు రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు ప్రకాశ్‌రావు, శ్రీనివాసరావు, ఏపీసీఎన్ఎఫ్ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వలి, హుమాయున్, యశ్వంత్‌రెడ్డి, దేవరపల్లి మండల ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రతినిధులు సీతాదేవి, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి .. మరొకరికి తీవ్ర గాయాలు


సంఘటన స్థలంలో వినయ్ కుమార్ మృతదేహం

దేవరపల్లి, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను వెనుక నుంచి మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గౌరీపట్నం ఫ్లైఓవర్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏలూరుకు చెందిన ఏన్నెటి గోవింద్ అతని బావ విజయవాడ జిల్లా కంట్రికకు చెందిన కల్లూరి వినయ్‌కుమార్ (27) ఇద్దరూ కలిసి ఏలూరు నుంచి నర్సీపట్నం స్కూటీపై వెళ్తుండగా... మండలంలోని గౌరీపట్నం జాతీయ రహదారి వద్ద ఐషర్ వ్యాన్ ఎటువంటి సిగ్నల్ లేకుండా నిర్లక్ష్యంగా ఆపి ఉండటంతో స్కూటీపై వెళ్తున్న వినయ్‌కుమార్ వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఈ ప్రమాదం జరిగింది. హైవే అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి వినయ్‌కుమార్‌ను తీసుకెళ్లగా చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. స్కూటీ వెనుక కూర్చున్న ఏర్నేటి గోవింద్‌కు కన్ను, పెదవి వద్ద గాయాలవడంతో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వినయ్‌కుమార్ మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసినట్టు ఏఎస్సై కే.నాగభూషణం తెలిపారు. గోవింద్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై కేసు నమోదు చేశారు.

భాష్యం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

దేవరపల్లి, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): స్థానిక భాష్యం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు మాట్లాడుతూ విద్యార్థి సాధించిన ప్రగతిని తెలియజేయజేస్తూ ఒకటో తరగతి నుంచి ఆరో తరగతిలో ప్రవేశిస్తున్న విద్యార్థులకు దీన్ని నిర్వహించినట్టు చెప్పారు. అనంతరం క్విజ్, వక్తృత్వ, పాటలు, నృత్యపోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి ఆంజనేయులు, చాప్స్ ప్రిన్సిపాల్ షేక్‌షబానా, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రాంపాలెంలో పొలంబడి

గోపాలపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మెరైన వ్యవసాయ పద్ధతులు పాటించటం ద్వారా సాగు చేసిన రైతులకు ఇండిగ్యాప్ సర్టిఫికెషన్ ద్వారా పండించిన ఉత్పత్తులను 129 దేశాల్లో విక్రయించడానికి అనువుగా రాష్ట్రప్రభుత్వం సన్నాహాలు సిద్ధం చేస్తుందని ఏవో రాజారావు రైతులకు సూచించారు. రాంపాలెంలో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రాజు, బిందు, మధు, రైతులు పాల్గొన్నారు.

కేజీ వెండి రూ.లక్ష

• 10 గ్రాముల బంగారం రూ.80,700
• ధరల్లో పోటీపడుతున్న బంగారం , వెండి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఆల్‌టైం రికార్డుకు వెండిధర చేరింది. వెండి వ్యాపారంలో సువర్ణాక్షరాలతో లిఖించవలసి రోజిది. వూహించినట్టుగానే కేజీ వెండి ధర రూ.లక్ష అయింది. రాజమండ్రి మార్కెట్‌లో గురువారం కేజీ వెండి ధర రూ.లక్షగా ఉంది. జనవరి 1వతేదీన రూ. 88,400గా ఉన్న కేజీ వెండి ధర కేవలం 50రోజుల్లో రూ.11వేల 600 పెరిగి , రూ.లక్ష అయిపోయింది. లక్షణంగా నిలిచింది. జనవరి నుంచి క్రమంగా ఈధరలు పెరుతూ వస్తున్న సంగతి తెలిసిందే. బంగారం ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర 80,700 అయింది. 24 క్యారెట్ ధర రూ.88,040 అయింది. మరో 12వేలు పెరిగితే ఇదీ రూ.లక్ష అవుతోంది. ఈధరలు ఇలా విపరీతంగా పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే బాగా కొనుగోలు చేసుకున్నవారు మాత్రం సంతోషంగా ఉన్నారు.